

సంచలన వార్తలకు
నేడు
TELUGU DAILY



వైభవ్ విధ్వంసం 08

బుధవారం | 25.11.2026 | సంపుటి : 4 | సంచిక : 207 | పేజీలు : 8 | వెల : 2/- www.nedudailynews.com



వైభవంగా తిరువణ్ణామలై కార్తిక మహాదీపోత్సవం

తిరువణ్ణామలై, నవంబరు 24 : తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక మహాదీపోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం 4 గంటలకు ఆలయంలో భరణి దీపం, అనంతరం 6 గంటలకు 2,668 అడుగుల ఎత్తయిన కొండపై మహాపాత్రలో మహాదీపాన్ని వెలిగించారు. ఏడడుగుల ఎత్తుతో వెలిగిన ఆ జ్వాల.. నాలుగు దిక్కులా 35 కి.మీ. మేర కనిపించింది. మహాదీపానికి 4,500 కిలోల నెయ్యిని ఉపయోగించగా, 11 రోజులపాటు నిరంతరాయంగా వెలుగుతుంది. మహాదీపోత్సవం సందర్భంగా తిరువణ్ణామలైకి లక్షల మంది భక్తజనం పోటెత్తారు.

మూసీ పునరుజ్జీవ పనుల్లో
వేగం పెంచాలి

జనవరిలో.. మూసీ ఫేజ్-1 పనులు

హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కి.మీ.. ఉస్మాన్‌సాగర్ నుంచి మరో 11.8 కి.మీ. మేర నిర్మాణం

సీఎం రేవంత్‌రెడ్డికి వివరించిన అధికారులు

ఎస్టీపీల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్ల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో క్యూర్, ప్యూర్‌ల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్లు తదితర పనులపై ఆయన ఆరా తీశారు. మంగళవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని బోధి పెవిలియన్‌లో మున్సిపల్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



హైదరాబాద్, నవంబరు 24 : ఆయా ప్రాజెక్టుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా మొదటి దశ కింద హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు ఉన్న 9.2 కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్-1(ఏ)గా, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు ఉన్న 11.8 కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్-2(బీ)గా విభజించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి దశ పనులను వచ్చే ఏడాది జనవరి నుంచి మొదలు పెట్టనున్నట్లు, దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియను ప్రారంభించినట్లు అధికారులు రేవంత్‌రెడ్డికి వివరించారు.

-మిగతా 2 లో..



ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడంతోనే
డ్రగ్స్ బారిన యువత

దేశంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న డ్రగ్స్

దేశాన్ని, యువతను రక్షించుకునేందుకు 'నషా ముక్త్ భారత్' : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 24 : దేశంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న డ్రగ్స్ వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కవాడిగూడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "దేశానికి యువత ప్రధానమైన ఆస్తి. ప్రపంచంలోనే భారత్‌లో యువ జనాభా ఎక్కువగా ఉంది. పంజాబ్‌లో యువత డ్రగ్స్‌కు బానిసై నిర్వీర్యం అవుతోంది. దేశాన్ని, యువతను రక్షించుకునేందుకు 'నషా ముక్త్ భారత్' కోసం పని చేయాలని ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారు. కొందరు డ్రగ్స్ ద్వారా వచ్చే ఆదాయాన్ని దేశ వ్యతిరేక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం..

-మిగతా 2 లో..

ఈ నెల 26న
ఇందిరమ్మ చీరల పంపిణీ

18 ఏళ్లు నిండిన మహిళలందరూ అర్హులు

గ్రామాల్లో 65 లక్షలు.. పట్టణాల్లో 35 లక్షలు పంపిణీ



హైదరాబాద్, నవంబరు 24 : తెలంగాణలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ ఉచిత చీరల పంపిణీని ఈ నెల 26 నుంచి చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఆ రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీని చేపడతారు. ఇందిరా మహిళాశక్తి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం పేద మహిళలకు ఉచిత చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రూ.336 కోట్లను మంజూరు చేయగా...

-మిగతా 2 లో..



సింగరేణి ఒప్పంద కార్మికులకు
శుభవార్త

కార్మికుల పిల్లలకు పదో తరగతి దాకా ఉచిత విద్య

సింగరేణి పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ

హైదరాబాద్, నవంబరు 24 : సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల పిల్లలకు సంస్థ పాఠశాలల్లో పదో తరగతి వరకు ఉచితంగా విద్య అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. సంస్థ పరిధిలోని 12 ఏరియాల్లో సుమారు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు

-మిగతా 2 లో..

నీళ్లైత్తవయ్యా రేవంత్ అంటే..
దుమ్మెత్తి పోస్తున్నారు

ఈ సర్కారు ఒక్క రిజర్వాయరైనా నిర్మించిందా?

నువ్వు మాట్లాడే తప్పుడు మాటలను ప్రజలు నమ్మరు

ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్ ఎప్పుడు రావాలో అప్పుడే వస్తారు

"నీళ్ల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలి.. కానీ అందుకు బదులుగా బురద చల్లితే ఎలా? తెలంగాణ నీటి హక్కులపై నిలదీస్తుంటే బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. గొంతు పెంచి మాట్లాడినంత మాత్రాన నిజాలు అబద్ధాలు కావని, ప్రజలు తప్పుడు మాటలను నమ్మరని స్పష్టం చేశారు.



హైదరాబాద్, నవంబరు 24 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై బురద చల్లేందుకు రేవంత్‌రెడ్డి విఫలయత్నం చేశారని విమర్శించారు. 'నీళ్లు ఎత్తవయ్యా రేవంత్ అంటే మాపై దుమ్మెత్తి పోస్తున్నారు. మోకాలికి బోడిగుండుకు ముడిపెట్టే అతితెలివి ప్రదర్శిస్తున్నారు. నిందలు వేసినంత మాత్రాన అవి నిజాలు కావు. నువ్వు మాట్లాడే తప్పుడు మాటలను ప్రజలు నమ్మరని,

-మిగతా 2 లో..



నేటి చికెన్ ధరలు

పారం ధర లైవ్ బర్డ్	102 (కిలో)
రిటైల్ లైవ్ బర్డ్	129 (కిలో)
డ్రెస్డ్ స్కిన్‌తో	200 (కిలో)
స్కిన్ లెస్	226 (కిలో)

12 గుడ్ల రిటైల్ ధర ₹86

ఏఐ వినియోగంలో
భారత్‌దే అగ్రస్థానం

9 ఆసియా-పసిఫిక్ మార్కెట్లపై బీసీజీ నివేదిక



న్యూఢిల్లీ, నవంబరు 24 : భారత్‌లోని ఉద్యోగుల్లో ఏకంగా 96% మంది రోజూ లేదా వారానికి 2-3 సార్లు కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగిస్తున్నారని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) నివేదిక తెలిపింది. 9 ఆసియా-పసిఫిక్ మార్కెట్లలో ఇదే అత్యధికం. దీనివల్ల ఉద్యోగులకు వారానికి సగటున 15 గంటల సమయం ఆదా అవుతోందని వెల్లడించింది.

-మిగతా 2 లో..



వరంగల్‌లో ఉద్రిక్తత

రాళ్లు, కోడిగుడ్లతో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల దాడి..

వరంగల్, నవంబరు 24 :రెండు రోజులుగా సవాళ్లు ప్రతి సవాళ్లు.. ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ వేడి పుట్టించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గం హైటెన్షన్‌కు వేదికైంది. పశ్చిమ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పరస్పర ఆరోపణలతో రాజకీయ వాతావరణం వేడెక్కించారు. ఈ క్రమంలో బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఇరు పార్టీల కార్యకర్తలు చేరుకోవడం ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు

-మిగతా 2 లో..

డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు హసీనా

మరణశిక్ష పడినా వెనక్కి తగ్గని మాజీ ప్రధాని



న్యూఢిల్లీ, నవంబరు 24 : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న ఆమె డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు ఆమె అధికార ప్రతినిధి తెలిపారు. 1971లో పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విముక్తి పొందిన వార్షికోత్సవం సందర్భంగా డిసెంబర్ 16న స్వదేశానికి వెళ్లాలని

-మిగతా 2 లో..



మూసీ పునరుజ్జీవ పనుల్లో వేగం పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

మీరాలం చెరువు అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి ఆరా తీసి.. అందులో చాలాకాలంగా పేరుకుపోయిన పూడికను తొలగించాలని ఆదేశించారు. రేడియల్ రోడ్లకు అవసరమైన భూసేకరణ పూర్తి చేసి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, గండిపేట వద్ద నిర్మిస్తున్న ఆధునిక గోశాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. మార్కెట్ అభివృద్ధి పనులకు సమాంతరంగా రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలో ట్రిపుల్ఐటీ జంక్షన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌కి సంబంధించి పలు డిజైన్లను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించిన ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో మల్టీ లెవల్ కార్ పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ సదుపాయం మెరుగుపరిచేందుకు ప్రతిపాదించిన పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టం (పీఆర్టీఎస్) ఫేజ్-1కు సంబంధించి టెక్నో ఎకానమీ ఫీజిబిలిటీని, కూకట్‌పల్లి నుంచి రాయదుర్గం మీదుగా బయోడైవర్సిటీ వరకు ఎలైన్‌మెంట్ ప్రతిపాదనలను అధికారులు వివరించారు. బేగంపేట మెట్రోస్టేషన్ నుంచి సచివాలయం, బషీర్‌బాగ్ మీదుగా రాణిగంజ్ వరకు ఎలైన్‌మెంట్ ప్రతిపాదనలను అధికారులు వెల్లడించగా వీటితో పాటు నెక్లెస్‌రోడ్డు, రాయదుర్గం, పీపుల్స్‌ప్లాజా పరిసరాల్లో కూడా పీఆర్టీఎస్ డిపోలు నిర్మించేందుకు అనువైన స్థలాలు గుర్తించి, సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. క్యూర్ పరిధిలో చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన పనుల వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా ఎస్టీపీల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరించారు. నగరంలో మెట్ల బావుల పునరుద్ధరణ విషయంలోనూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో సీఎస్ సంజయ్‌జాజు, ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి శేషాద్రి, కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్లు కర్ణన్, శ్రీజన, వినయ్‌కృష్ణారెడ్డి, ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడంతోనే

డ్రగ్స్ బారిన యువత

(మొదటిపేజీ తరువాయి)

మత్తు పదార్థాల వినియోగానికి కారణమవుతోంది. పట్టణ ప్రాంతాల్లో 25శాతం యువత డ్రగ్స్ వినియోగిస్తోంది. తల్లిదండ్రులకు దూరంగా ఉన్న పిల్లలకు.. కొత్త పరిచయాలు ఏర్పడి వీటి వినియోగం పెరిగిపోతోంది. నషా ముక్త్ భారత్ ఉద్యమంలో బస్తీ స్థాయి నుంచి భాగస్వామ్యం చేస్తూ అధికారులతో కమిటీలు వేస్తాం. మొదటి దశలో డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయనే సమాచారాన్ని సేకరిస్తున్నాం. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలని నిర్ణయించాం. ప్రభుత్వమే కాకుండా ప్రతి కుటుంబ సభ్యుడు, విద్యా సంస్థలు భాగస్వామ్యం అయితేనే డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దవచ్చు. మాదక ద్రవ్యాల ఉత్పత్తి, సరఫరా చేస్తున్న వారే మన లక్ష్యం. డ్రగ్ ఫ్రీ వారియర్స్‌గా తల్లిదండ్రులు, యువత మారాలి. డ్రగ్స్ నిరోధించేందుకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేస్తాం. మన దేశంలోకి వాటిని తీసుకువస్తున్న వారిని గుర్తించేందుకు దేశ సరిహద్దుల్లో జాగిలాల సంఖ్యను పెంచుతున్నాం. పేద ప్రజలు మత్తు పదార్థాల బారిన పడితే వారి చికిత్స కోసం పునరావాస కేంద్రాల సంఖ్య పెంచాలని చూస్తున్నాం. 50 కోట్ల మంది యువతకు నషా ముక్త్‌పై అవగాహన కల్పిస్తాం. తెలంగాణ ప్రభుత్వం క్రీడా మైదానాలు పెంచాలి. ప్రభుత్వ భూములు అమ్మకుండా స్పోర్ట్స్ సెంటర్స్‌గా వాటిని తీర్చిదిద్దాలి. డ్రగ్స్ నుంచి బయటపడిన వాళ్లకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలి. తెలంగాణలో ఈగల్ టీమ్ అద్భుతంగా పని చేస్తోంది. భారతీయ జీవన విధానం ప్రపంచానికి ఆదర్శం. డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు మొదటి దశలో మూడు రోజుల పాటు పాదయాత్ర చేస్తున్నాను. ఈనెల 25న ఉదయం అంబర్ పేట నుంచి పాదయాత్ర మొదలై 27న జూబ్లీహిల్స్ భారతీయ విద్యా భవన్ వద్ద ముగుస్తుంది" అని కిషన్‌రెడ్డి అన్నారు.



వరంగల్‌లో ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

ఇరు వర్గాలను చెదరగొట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బహిరంగ సభ తర్వాత రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. వరంగల్ అభివృద్ధిపై కేటీఆర్ చర్చకు రావాలని నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆ తర్వాత బీఆర్ఎస్ నేతలు.. చర్చకు సిద్ధమని ప్రతి సవాల్ విసిరారు. దమ్ముంటే నాయిని రాజేందర్ రాజీనామా చేసి పోటీ చేయాలని మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ సవాల్ చేశారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించాయి. అందుకు ప్రతిగా కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ కార్యాలయం వద్ద ఉన్న ప్లెక్సీలను చించివేశారు. రెండు పార్టీల కార్యాలయాలు పక్కపక్కనే ఉండటంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరస్పరం రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు.

ఆరేళ్ల తర్వాత ఎన్డీయే గూటికి
శిరోమణి అకాలీదళ్

- పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసికట్టుగా బరిలోకి
- అకాలీదళ్‌కే పెద్దన్న హోదా.. సీఎం పదవీ ఆ పార్టీకే
- కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటన
- బీజేపీతో కలిసి పంజాబ్ అభివృద్ధికి కృషి చేస్తాం
- అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ స్పష్టికరణ



న్యూఢిల్లీ, నవంబరు 24 : పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆరేళ్ల విరామం తర్వాత బీజేపీ, శిరోమణి అకాలీదళ్(ఎస్ఏడీ) మళ్లీ చేతులు కలిపాయి. రాష్ట్రంలో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీ చేయాలని ఇరు పార్టీలు నిర్ణయించాయి. ఎన్డీయేలో అకాలీదళ్ తిరిగి చేరినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. తమ కూటమిలో అకాలీదళ్‌దే పెద్దన్న పాత్ర అని, ముఖ్యమంత్రి పదవి ఆ పార్టీకే దక్కుతుందని స్పష్టం చేశారు. మొత్తం 117 అసెంబ్లీ స్థానాల్లో రెండు పార్టీ లు కలిసి పోటీ చేస్తాయని వెల్లడించారు. ఢిల్లీలో మంగళవారం బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఈ మేరకు పొత్తు ప్రకటన చేశారు. అకాలీదళ్‌ను బీజేపీకి 'అత్యంత పురాతన మిత్రపక్షం'గా అమిత్ షా అభివర్ణించారు. ఇరు పార్టీల మధ్య సంబంధం అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీల కాలం నాటిదని గుర్తుచేశారు. దేశమంతా పవిత్ర గురుపర్వ్ వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో అకాలీదళ్ మరోసారి ఎన్డీయేలోకి తిరిగి రావడం భాగస్వామ్య పక్షాలకు ఎంతో ఆనందం కలిగిస్తోందని అన్నారు. పంజాబ్‌లో అకాలీదళ్ పార్టీ యే పెద్దన్న పాత్ర పోషిస్తుందని తేల్చిచెప్పారు. బడా భాయ్ హీ సీఎం హోతా హై(పెద్దన్నే ముఖ్యమంత్రి అవుతారు) అని వ్యాఖ్యానించారు. పంజాబ్ ఎన్నికల్లో తమ కూటమి గెలిస్తే ముఖ్యమంత్రి పదవి అకాలీదళ్‌కే దక్కుతుందని వెల్లడించారు. అయితే, ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. సీట్ల సర్దుబాటుపై చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఎన్డీయేలోకి మళ్లీ అకాలీదళ్ రావడం తమకు చాలా సంతోషంగా ఉందన్నారు. రెండు పార్టీల మధ్య బంధం రాజకీయాలకు అతీతమైనదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఈ పరిణామంపై హర్షం వ్యక్తంచేశారని తెలిపారు. "పొత్తు నిర్ణయం గురించి మోదీకి తెలియజేసినప్పుడు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సుఖ్‌బీర్ సింగ్ బాదల్, నితిన్ నబీన్‌లకు ప్రధాని ఫోన్ చేసి మాట్లాడారు. బాదల్ సాహెబ్ పార్టీ లేకుండా ఎన్డీయే అసంపూర్ణంగా ఉంది. వారి రాకతో కూటమి సంపూర్ణమైంది"అని ప్రధాని అన్నట్లు అమిత్ షా వివరించారు. తమ కూటమి హిందూ--సిక్కు సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. పంజాబ్‌కే కాకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఈ ఐక్యతా సందేశం వెళ్లాలని వ్యాఖ్యానించారు. పంజాబ్‌లో మాదక ద్రవ్యాల సమస్యను నిర్మూలించడమే కూటమి ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అమిత్ షా ప్రకటించారు. 2029 డిసెంబర్ నాటికి పంజాబ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలన్నదే తమ ఆశయమని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ తోపాటు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.

నీళ్లెత్తవయ్యా రేవంత్ అంటే

దుమ్మెత్తి పోస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

నీకంటే, నాకంటే ప్రజలు తెలివైనవారని రేవంత్ అర్థం చేసుకోవాలి' అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే తప్పన్నట్లుగా రేవంత్ మాటతీరు ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ బిడ్డలపై తుపాకీ గురిపెట్టడమే సరైనదన్నట్లు సీఎం మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ హక్కుల గురించి రేవంత్‌రెడ్డి ఏనాడైనా మాట్లాడారా? తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రాజెక్టులు, నీటి వాటాల గురించి ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. తెలంగాణలో వలసలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని ఆరోపించారు. అలాగే మెదక్ జిల్లాకు ఆయకట్టు వచ్చిందంటే అది కేసీఆర్ చేసిన పోరాటం వల్లేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. పాలమూరు జిల్లాను నాశనం చేసింది కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలేనని విమర్శించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు ప్రాజెక్టుల కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామని, ఒక్క పాలమూరు జిల్లాలోనే 10 లక్షల ఎకరాలకు నీరు అందించామని తెలిపారు. కాని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదనంగా లక్ష ఎకరాలకైనా నీరు అందించారా? అని ప్రశ్నించారు. సొంత జిల్లా పాలమూరుకు రేవంత్‌రెడ్డి ద్రోహం చేశారని ఆయన ఆరోపించారు. తెలంగాణను కరువుపాలు చేసిందే కాంగ్రెస్ అని, నీటి హక్కులపై సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సరికాదని, కాంగ్రెస్ నేతలు కట్టు బానిసలుగా వ్యవహరిస్తున్నారని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

కుప్పం వరకు కృష్ణా నీరు.. పాలమూరుకు మాత్రం లేదు

ప్రాణాలను పణంగా పెట్టి కేసీఆర్ తెలంగాణను తీసుకురావడం తప్పా? కృష్ణా జలాల కోసం సెక్షన్ 3 తేవడం తప్పా? పాలమూరులో భారాస హయాంలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. ఈ సర్కారు వచ్చాక పాలమూరులో అదనంగా లక్ష ఎకరాలకైనా నీరిచ్చిందా? రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే ఏపీలో 403, 405 జీవోల ద్వారా కుప్పం వరకు కాలువకు లైనింగ్ చేయించారు. 700 కి.మీ. దూరంలోని కుప్పం వరకు కృష్ణా నది నీళ్లు పారుతున్నాయి.. ఇక్కడే ఉన్న పాలమూరుకు మాత్రం జలాలు రాలేదు. భారాస హయాంలో 482 జీవో



ద్వారా ఇంకో పథకం వచ్చిందని సీఎం అన్నారు. వాస్తవానికి ఆ జీవో 482 కాదు.. అది జీవో 483. నాగార్జునసాగర్ నుంచి అని తప్పుదోవ పట్టించేలా సీఎం మాట్లాడారు. ఒంగోలు బ్రాంచ్ కెనాల్ నుంచి నీరు తీసుకోవాలని ఆ జీవోలో ఉంది. అలాగే కృష్ణాలో 50:50 నిష్పత్తిలో కృష్ణా జలాలు ఉపయోగించుకోవాలని 30 లేఖలు రాశాం. రేవంత్ సీఎం అయ్యాక కూడా 66:34 తాత్కాలిక ఒప్పందం చేసుకుంటూ సంతకం చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి 2020 మే నెలలో జీవో తీసుకొస్తే భారాస ప్రభుత్వం చేసిన పోరాటంతోనే పనులు ఆగిపోయాయి. కాంగ్రెస్ పని అయిపోయిందని ఆ పార్టీ ఎమ్మెల్యేలే అంటున్నారు. కొందరు మంత్రులు ఎన్నికల్లో పోటీ చేయబోమని అంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. పీఠం కిందకు నీరు వచ్చాయని రేవంత్‌రెడ్డికి అర్థమైంది. అందుకే భారాసపై బురద చల్లుతున్నారు. రేవంత్‌రెడ్డి నిద్రలో కూడా కేసీఆర్‌నే కలవరిస్తున్నారు. కేసీఆర్ అన్నీ గమనిస్తున్నారు. ఎప్పుడు రావాలో అప్పుడే ప్రజాక్షేత్రంలోకి వస్తారు" అని హరీశ్‌రావు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో భారాస నేతలు మధుసూదనాచారి, లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 26న
ఇందిరమ్మ చీరల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

సిరిసిల్ల మరో 13 ప్రాంతాల్లో వాటిని తయారు చేశారు. ఈ నెల 19న ఇందిరాగాంధీ జయంతి రోజున పంపిణీ కోసం మొదట ఏర్పాట్లు చేసినా... ఇతర కార్యక్రమాల రద్దీ వల్ల వాయిదా వేశారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దీనిని ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన మహిళలందరూ చీరలను పొందేందుకు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మందికి, పట్టణ ప్రాంతాల్లో 35 లక్షల మందికి ప్రభుత్వం ఈ చీరలను పంపిణీ చేయనుంది. వాటిని చిలుకపచ్చ రంగులో ప్రత్యేకంగా తయారు చేశారు. నాణ్యత, మన్నికకు ప్రాధాన్యమిచ్చారు. ఆధునిక డిజైన్లతో పాటు సంప్రదాయ పద్ధతిలో ధరించేందుకు వీలుగా రెండు రకాలను సిద్ధం చేశారు. 59 ఏళ్ల వరకు ఉన్న వారికి 6.30 మీటర్ల పొడవుతో 95 లక్షల పాలిస్టర్ చీరలు, 60 ఏళ్లు దాటిన మహిళలకు 9 మీటర్ల పొడవుతో 5 లక్షల పాలీకాటన్‌వి తయారు చేయించారు. అచ్చంపేటలో సీఎం కార్యక్రమం ముగిసిన వెంటనే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో



రాష్ట్రవ్యాప్తంగా కూడా చీరల పంపిణీ ప్రారంభమవుతుంది. అర్హులైన మహిళలు రేషన్ కార్డు, ఆధార్ వివరాలను చూపించి పొందవచ్చు. పారదర్శకంగా పంపిణీ చేపట్టేందుకు ప్రత్యేక మొబైల్‌యాప్‌లో అర్హుల నమోదు చేస్తారు.

డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు హసీనా

(మొదటిపేజీ తరువాయి)

హసీనా భావిస్తున్నారు. ఢిల్లీ నుంచి ఢాకాకు తన ప్రయాణానికి బంగ్లాదేశ్ జాతీయ విమానయాన సంస్థ ద్వారా ఏర్పాట్లు చేయాలని ప్రధాని తారిఖ్ రెహమాన్ ప్రభుత్వాన్ని ఆమె కోరారు. విద్యార్థుల నేతృత్వంలో జరిగిన భారీ ఉద్యమం నేపథ్యంలో 2024 ఆగస్టు 5న హసీనా తన 15 ఏండ్ల పాలనకు ముగింపు పలికి భారత్‌కు వచ్చారు. ఉద్యమ సమయంలో నిరసనకారులపై జరిగిన అణచివేతకు సంబంధించి హసీనాపై కేసు నమోదైంది. బంగ్లాదేశ్ కోర్టు ఆమెకు మరణశిక్ష విధించింది. అయితే ఈ తీర్పును హసీనా తిరస్కరించారు. స్వదేశానికి తిరిగొచ్చాక న్యాయపోరాటం చేస్తానని గతంలోనే ప్రకటించారు. హసీనా బంగ్లాదేశ్‌కు తిరిగొస్తే అరెస్టు చేసి జైలుకు పంపే అవకాశం ఉంది. ఆమెకు మరణశిక్షపై అప్పీల్ చేసేందుకు గడువు ముగిసిందని తెలిపింది.

సింగరేణి ఒప్పంద కార్మికులకు శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

పనిచేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఇటీవల కోల్‌బెల్ట్ ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది. అందులో తీసుకున్న నిర్ణయాల్లో ఇది ఒకటి. సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ మేనేజర్ ఈ మేరకు అన్ని ఏరియాలకు ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ ఆధ్వర్యంలోని 9 పాఠశాలల్లో ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికుల పిల్లలు 400 మందికి పైగా చదువుతున్నారు. వీరికి ఉచిత విద్య తక్షణమే వర్తిస్తుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్తగా చేరే పిల్లలకూ దీనిని విస్తరిస్తారు. దీంతో సింగరేణి విద్యాసంస్థల్లో వీరి ప్రవేశాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ సదుపాయం కోసం కార్మికులు కొన్ని పత్రాలను సంబంధిత సింగరేణి శాఖాధిపతుల ద్వారా ధ్రువీకరించి సమర్పించాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. తమ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పిల్లల ఆధార్ కార్డు, ప్రభుత్వం జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను అందించాల్సి ఉంటుంది.

ఏఐ వినియోగంలో భారత్‌దే అగ్రస్థానం

(మొదటిపేజీ తరువాయి)



ఆసియా-పసిఫిక్ (అపాక్)లో ఏఐని ఉపయోగించే ఉద్యోగుల వాటా 85 శాతంగా ఉందని 'ఫర్ ఆసియా-పసిఫిక్, స్ట్రాటజిక్ క్లారిటీ ఈజ్ ది కీ టు వాల్యూ' పేరుతో విడుదల చేసిన నివేదికలో బీసీజీ పేర్కొంది. దీని ప్రకారం.. ఏఐ వల్ల అపాక్‌లో ఉద్యోగులకు వారానికి సగటున 9.4 గంటలు ఆదా అవుతుంటే, భారతీయ ఉద్యోగులకు వారానికి 15 గంటలు ఆదా అవుతున్నాయి. భారత్‌లోని ఉద్యోగుల్లో 61% మంది, ఏఐ ద్వారా ఆదా అయిన సమయాన్ని అదనపు వ్యూహాత్మక పనుల కోసం ఉపయోగిస్తున్నారు. అపాక్‌లో ఇది 44 శాతంగా ఉంది. ఈ విషయంలో భారత్ 9 మార్కెట్లలో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా (60%), చైనా (37%) ఉన్నాయి. భారత్‌లో 38% మంది ఉద్యోగులకు ఏఐపై వ్యూహాత్మక స్పష్టత ఉంది. అపాక్ వ్యాప్తంగా ఇది 20 శాతమే. ఏఐని ఒక వ్యూహాత్మక ప్రాధాన్యతగా తెలియజేయడం, స్పష్టమైన వ్యూహాన్ని అందించడం, ఉద్యోగులు తమ పాత్రలను అర్థం చేసుకునేలా చూడటం, ఏఐ ద్వారా ఆదా అయిన సమయాన్ని ఎలా ఉపయోగించుకోవాలో వారికి సంస్థలు మార్గనిర్దేశం చేస్తున్నాయి. భారత్‌లో 42% మంది ఉద్యోగులు తమకు ఏఐ శిక్షణ సరిపోతుందన్నారు. 59% మంది తమ సంస్థల్లో మానవ-ఏఐ బృందాల కోసం నియమాలు అమల్లో ఉన్నాయన్నారు. ఆస్ట్రేలియా, చైనా, భారత్, ఇండొనేషియా, జపాన్, మలేషియా, సింగపూర్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్ మార్కెట్లలోని 6,349 మంది ఉద్యోగుల నుంచి సేకరించిన వివరాలతో ఈ నివేదిక వెలువడింది. ఇందులో భారత్ నుంచి 882 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. 'పని ఎంత వేగంగా పూర్తవుతుందనే దాన్నే కాకుండా, ఉద్యోగులు దేనిపై దృష్టి పెట్టగలరనే అంశాన్ని కూడా ఏఐ మారుస్తోంది. సంస్థలు ఏఐ నుంచి విలువను ఎలా పొందగలవనే విషయంలో ఇది ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తోంది. పనివిధానాన్ని పునఃరూపకల్పన చేయడం, ఉద్యోగుల సామర్థ్యాలను బలోపేతం చేయడం, అర్థవంతమైన వ్యాపార ఫలితాలను అందించడానికి ఏఐని ఎలా ఉపయోగించవచ్చో స్పష్టత ఇవ్వడం ద్వారా, ఈ వేగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం ఇప్పుడు నాయకుల ప్రాధాన్యత' అని బీసీజీ ఎక్స్ ఇండియా లీడర్ నిపుణ్ కల్రా అభిప్రాయపడ్డారు.



యువతకు ఉపాధి కల్పనకు ఉద్యమిద్దాం

- డిసెంబర్ 7న తలపెట్టిన పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేద్దాం
- ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్‌ల పిలుపు

మేడ్చల్, నేడు బ్యూరో: ప్రజాస్వామ్య పరిరక్షణ, యువతకు ఉపాధి కల్పనకు ఉద్యమించాలని, అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) లు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా, విద్యార్థి, యువజన సమాఖ్యల జాతీయ సమితిల సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 7న తలపెట్టిన పార్లమెంట్ మార్చ్ (ఛలో ఢిల్లీ) కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సల్మాన్ బేగ్, తోకల సత్యప్రసాద్ లు మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల కాపాడటం, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఈ పార్లమెంట్ మార్చ్ ద్వారా డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. భగత్‌సింగ్, అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ శాస్త్రీయ దృక్పథం, సామాజిక న్యాయం, సమానత్వం ఆధారంగా నూతన భారత నిర్మాణం కోసం యువతరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువజనులు, ప్రజాస్వామ్యం, విద్య, ఉపాధి హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్ (బనేగా)ను చట్టంగా తీసుకురావాలన్నారు. ప్రతి నిరుద్యోగ అభ్యర్థికి ఉపాధి కల్పించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని --2020ను ఉపసంహరించి, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలనీ, పరిరక్షించాలని, అందరికీ ఉచిత సమాన, నాణ్యమైన విద్యను అందించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి యువజనులు, విద్యార్థులు డిసెంబర్ 7 నిర్వహించనున్న 'చలో పార్లమెంట్' మార్చ్ లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఆఫీస్ బేరర్స్ గిరిబాబు, ఏం. చంద్రశేఖర్, ఉప్పల్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు కె. సచిన్, సుదర్శన్, శివ కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు ప్రతాప్, కపిల్, అక్సర్, శ్రీనివాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నేత్రపర్వంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- కార్తీక శోభతో వెల్లివిరిసిన సర్కిల్ పరిధిలోని శివాలయాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



బోడుప్పల్, నేడు న్యూస్: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని సర్కిల్ పరిధిలోని ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా బోడుప్పల్, చెంగిచెర్ల, పీర్జాదిగూడ, మేడిపల్లి, పర్వతాపూర్ ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం నుంచే ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే బోడుప్పల్ లోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయం, పీర్జాదిగూడ బుద్ధా నగర్, శంకర్ నగర్ లోని శివాలయం, పర్వతాపూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, మేడిపల్లి లోని శివాలయం, శ్రీరామాలయం, పీ.ఎన్.టీ కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, మల్లికార్జున నగర్ లోని శివాలయం, ఎన్ఐఎన్ కాలనీలోని శివాలయంతో పలు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను జరిపించారు. ఈ సందర్భంగా కార్తీక దీపాలతో ఆలయాలు దేదీప్యమానంగా వెలుగొందాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. బోడుప్పల్ శ్రీ విశ్వనాథ శివాలయంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పలు ఆలయాల్లో జరిగిన కార్తీక పౌర్ణమి వేడుకల్లో మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆయా కాలనీల ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

26న మేడ్చల్ ఐటీఐలో అపోలో
ఫార్మసీ మెగా జాబ్ డ్రైవ్

సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.రాధిక



మేడ్చల్, నేడు బ్యూరో : మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న, గురువారం మేడ్చల్ లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అపోలో ఫార్మసీ, హైదరాబాద్ మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు ఆ శాఖ మేడ్చల్ జిల్లా అధికారి ఎం. రాధిక వెల్లడించారు. మంగళవారం ఆమె ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, అపోలో ఫార్మసీ సంస్థ దేశంలోనే ప్రముఖ ఫార్మా రిటైల్ అని, ఈ సంస్థలో ఉద్యోగం పొందిన అభ్యర్థులకు ఈఎస్ఐ, పీఎఫ్, నెలవారీ ఇన్సెంటివ్స్, వార్షిక బోనస్, ఏటా ఇంక్రిమెంట్ తదితర సౌకర్యాలు కల్పిస్తారని అన్నారు. ఇందులో, నాన్-లోకల్ పురుష అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు.

ఖాళీలు – మొత్తం 100

పోస్టు పేరు అండ్ అర్హత : ఫార్మసిస్ట్ డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, + తెలంగాణ పి.సి.ఐ సర్టిఫికెట్ 25., ట్రైనీ ఫార్మసిస్ట్ అండ్ అర్హత :

డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, + తెలంగాణ పి.సి.ఐ సర్టిఫికెట్ లేకుండా 20.

ఫార్మసీ అసిస్టెంట్‌లి టెన్త్, ఇంటర్, డిగ్రీ + మెడికల్ స్టోర్ అనుభవం 25. ప్రొడక్ట్ అడ్వైజర్ బి.బి.ఎం, బి.ఎస్.సి(కెమిస్ట్రీ/ న్యూట్రిషన్/ ఫుడ్ సైన్స్) 5. రిటైల్ ట్రైనీ అసిస్టెంట్ (అప్రెం టిస్) ఎస్.ఎస్.సి, ఇంటర్, డిగ్రీ (ఫ్రెషర్స్) 25.

వయస్సు: 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలి.

జీతం: పోస్టును బట్టి నెలకు రూ.12,500 నుండి రూ.25,000 వరకు (ఇన్ హ్యాండ్ వేతనం) + ఇన్సెంటివ్స్ ఉంటాయి. పని ప్రదేశం: హైదరాబాద్

జాబ్ డ్రైవ్ వివరాలు:

తేదీ: ఈ నెల 26న గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు

వేదిక: ప్రభుత్వ ఐటీఐ – మేడ్చల్

తీసుకురావలసిన పత్రాలు:

1. విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్
2. ఆధార్ కార్డ్ జిరాక్స్
3. ఎస్.ఎస్.సి, టి.జి పి.సి.ఐ ఒరిజినల్ సర్టిఫికెట్
4. మెడికల్ స్టోర్ అనుభవ పత్రం (ఉంటే)
5. 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకు వెళ్ళాలి.

సద్వినియోగం చేసుకోవాలి... ఎం.రాధిక – మేడ్చల్ జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ :

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులందరూ ఈ జాబ్ డ్రైవ్ లో పాల్గొని ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిల్లా ఉపాధి అధికారి ఎం. రాధిక కోరారు.

ఈ నెల 26న హైదరాబాద్‌లో
సంవిధాన్ రక్షా మార్చ్

- పెద్ద ఎత్తున తరలిరండి
- కాంగ్రెస్ శ్రేణులకు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ పిలుపు
- జిల్లాలోని ప్రతి డివిజన్ నుంచి 100 మంది తరలాలి
- తోటకూర వజ్రేష్ యాదవ్



మేడ్చల్, నేడు బ్యూరో: ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సంవిధాన్ రక్షా మార్చ్ ను జయప్రదం చేయాలని రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో, జిల్లా డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యుల ముఖ్య సమావేశం మంగళవారం అంతాయపల్లి లోని ఎస్.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగింది.



ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఈ ర్యాలీ లిబర్టీ సర్కిల్‌లోని డాక్టర్: బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు కొనసాగుతుందని, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే లక్ష్యంగా చేపట్టిన ఈ సంవిధాన్ రక్షా మార్చ్‌ను విజయవంతం చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, ఈ ర్యాలీకి జిల్లాలోని ప్రతి డివిజన్ నుంచి వంద మంది కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కున్న శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఇంచార్జి కొలను హనుమంత్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ యాదవ్ జిల్లా డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్వాల్‌లో హెల్మెట్
బ్యాంక్ ప్రారంభం

- హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి ఉచితంగా హెల్మెట్లు.. 150 హెల్మెట్ల విరాళం
- హెల్మెట్ జరిమానా నుంచి తప్పించుకునేందుకు కాదు.. ప్రాణాలను కాపాడుకునేందుకు ధరించాలి: ట్రాఫిక్ పోలీసులు



సికింద్రాబాద్, నేడు న్యూస్: రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారుల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ చొరవతో మంగళవారం అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐజీ విగ్రహం వద్ద హెల్మెట్ బ్యాంకును ప్రారంభించారు. తిరుమలగిరి ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై హెల్మెట్ బ్యాంకును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏసీపీ శంకర్ రాజు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొందించి, ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను రక్షించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వారికి ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి చెల్లుబాటు అయ్యే పత్రాలను సమర్పించిన అనంతరం తాత్కాలికంగా ఉచిత హెల్మెట్ అందజేస్తామని వివరించారు. హెల్మెట్ పొందిన వారు 24 గంటల్లోగా సొంత హెల్మెట్ కొనుగోలు చేసి, పోలీసుల వద్ద తీసుకున్న హెల్మెట్‌ను తిరిగి బ్యాంకుకు అప్పగించాలని సూచించారు. తద్వారా మరికొందరు వాహనదారులకు కూడా ఈ సదుపాయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి 150 హెల్మెట్లను విరాళంగా అందించిన వాల్యూ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హెడ్ ఆఫ్ మార్కెటింగ్ అంజని, సంస్థ ప్రతినిధి నితిన్‌లకు అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఇప్పటికే మూడు నెలల క్రితం గోపాలపురం, బేగంపేట, తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రారంభించిన హెల్మెట్ బ్యాంకులు విజయవంతంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో లభించిన స్పందనతో ఈ కార్యక్రమాన్ని అల్వాల్‌కు కూడా విస్తరించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జి. జనకిరాములు, బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసులు, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ డి. ప్రమోద్ కుమార్, తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్లు వి. సర్దార్ నాయక్, వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ద్విచక్ర వాహనదారులకు కీలక సూచన చేశారు. ఐఎస్ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్లను తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. హెల్మెట్ కేవలం జరిమానా నుంచి తప్పించుకునే సాధనం కాదు.. అది ప్రాణాలను కాపాడే రక్షణ కవచం. మీ భద్రతే మీ కుటుంబ సంతోషం అని పిలుపునిచ్చారు.



విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- మేకలమండి ప్రభుత్వ పాఠశాలకు 8, 9, 10 తరగతుల అనుమతులు..

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతుంది

. పాఠశాల అభివృద్ధికి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు చేసిన కృషి అభినందనీయం

సికింద్రాబాద్, నేడు న్యూస్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారు ఉన్నత చదువులు చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆకాంక్షించారు. సికింద్రాబాద్ మండలం భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు 8, 9, 10వ తరగతుల నిర్వహణకు అధికారిక అనుమతులు మంజూరు కావడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ఈ అనుమతుల కోసం కృషి చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు సుమారు 700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో విద్యార్థులు ఇదే పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకునే అవకాశం కలుగుతుందని, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలిచిన కిషన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరుడిగా ఎదగాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు. పాఠశాల అభివృద్ధితో పాటు ఉన్నత తరగతుల అనుమతుల సాధన కోసం పూర్వ ప్రధానోపాధ్యాయుడు కె. మల్లికార్జున రెడ్డితో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, జర్నలిస్టులు ఐకమత్యంతో ముందుకు వచ్చి కృషి చేయడం అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అందరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఈ. చంద్రశేఖర్ (సాక్షి), ప్రధాన కార్యదర్శి బి. నర్సింగ్ రావు (నమస్తే తెలంగాణ), ఉపాధ్యక్షుడు ఆర్. రాజు (టీ న్యూస్), డి. భరత్ భూషణ్, పూర్వ ప్రధానోపాధ్యాయుడు కె. మల్లికార్జున రెడ్డి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు జి. స్వరూప, ఉపాధ్యాయులు సలిత, అరుణ బాయి, మహేష్, దినేష్, బీజేపీ నాయకులు వై. శ్రీనివాస్ ముదిరాజ్, ఆర్. మహేష్, బి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బండ కార్తీక రెడ్డి నివాసంలో వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరు
- పాల్గొన్న పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

సికింద్రాబాద్, నేడు న్యూస్: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక రెడ్డి, బండ చంద్ర రెడ్డి దంపతుల నివాసంలో మంగళవారం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ పూజా కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు అందుకొని బండ కార్తీక రెడ్డి, బండ చంద్ర రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకకు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, బీజేపీ నాయకులు గౌతమ్ రావు, చింతల రామచందర్ రెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, బంగారు శృతి, మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, రచనా రెడ్డి, బానుక మల్లికార్జున్, బీజేవైఎం సిటీ అధ్యక్షుడు అల్లం శివకుమార్ యాదవ్‌తో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, భక్తులకు నిర్వాహకులు ఘనంగా తీర్థప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కార్తీక పౌర్ణమి పర్వదినాన నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుక భక్తిభావంతో సందడిగా సాగింది. బండ



కుత్బుల్లాపూర్‌లో డీఎంహెచ్ఓ డా. కె. ఆనంద్ ఆకస్మిక తనిఖీ

- ఎస్ఎన్ఐడీ మాప్-అప్ డేలో ఇంటింటి సర్వే పరిశీలన

మేడ్చల్, నేడు బ్యూరో: మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా: కె. ఆనంద్ కుత్బుల్లాపూర్‌లోని యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీలో నిర్వహిస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, సంబంధిత రికార్డుల్లోని వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదైన సమాచారంతో సరిపోల్చి ధృవీకరించారు. అనంతరం సబ్-నేషనల్ ఇమ్యునైజేషన్ డే -- పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మాప్-అప్ డే కార్యక్రమాన్ని పరిశీలించారు. కుత్బుల్లాపూర్‌లోని గార్డెన్ బస్తీ ప్రాంతంలో చేపట్టిన ఇంటింటి సర్వేను స్వయంగా పరిశీలించిన డీఎంహెచ్ఓ, సర్వే ద్వారా గుర్తించిన పోలియో టీకా తీసుకోని మిగిలిన చిన్నారులకు ఓరల్ పోలియో వ్యాక్సిన్ చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా, ఇంటింటి సర్వేను పూర్తి స్థాయిలో నిర్వహించి, ఒక్క చిన్నారి కూడా టీకాకు దూరం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడంలో వైద్య సిబ్బంది, ఏ.ఎన్.ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు.





మర్తాడు సర్పంచ్‌గా డిక్లరేషన్ ఫారం అందుకున్న ఆవుల లక్ష్మి

- ఏకగ్రీవ ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేత
- హర్షం వ్యక్తం చేసిన నాయకులు, గ్రామస్థులు

గార్లదిన్నె, నేడు న్యూస్: మండల పరిధిలోని మర్తాడు గ్రామ సర్పంచ్‌గా అనంతపురం బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య సతీమణి ఆవుల లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన ఆమెకు మంగళవారం ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఎంఈఓ తారక్ చంద్ర నాయక్ ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేయగా, ఏ డి సి సి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి చేతుల మీదుగా ఆవుల లక్ష్మి ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరించారు. అనంతరం ఆవుల లక్ష్మి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నిక కావడంతో కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ ఆవుల లక్ష్మి గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

ఉచితాల వెల్లువలో తెలంగాణ..
అభివృద్ధికి మూల్యం చెల్లించొద్దు.!

ప్రజాసంక్షేమం ప్రభుత్వ బాధ్యత. పేదలకు ఆర్థిక భరోసా కల్పించడం, మహిళలకు చేయూతనివ్వడం, రైతులకు అండగా నిలవడం, నిరుపేదల జీవన భారాన్ని తగ్గించడం ప్రజాస్వామ్యంలో కీలకమైన అంశాలు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత వంటి పథకాలు లక్షల కుటుంబాలకు ఉపశమనం కలిగిస్తున్నాయి. అయితే సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత తప్పనిసరి. నేటి ప్రయోజనాల కోసం రేపటి తరాల భవిష్యత్తును తాకట్టు పెట్టకూడదు.



2026--27 తెలంగాణ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల కోసం ఏకంగా రూ.50,713 కోట్లు కేటాయించారు. ఇందులో రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు, చేయూత పింఛన్లకు రూ.14,861 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.5,500 కోట్లు, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణానికి రూ.4,305 కోట్లు ఉన్నాయి. ఈ కేటాయింపులు రాష్ట్ర ఆదాయంలో గణనీయమైన భాగం. వీటివల్ల నిజంగా ఎంతమంది పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి? ఎంతమంది స్వయం సమృద్ధి సాధించారు? ఎంతమంది మహిళలు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకున్నారు? అన్నది కూడా ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలి.

రాష్ట్ర మొత్తం బడ్జెట్ వ్యయం రూ.3.24 లక్షల కోట్లకు చేరుతుండగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా ప్రతిపాదించారు. రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, ఆసుపత్రులు, పాఠశాలలు, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు అత్యంత కీలకం. ద్రవ్యలోటు రూ.58,459 కోట్లుగా అంచనా వేస్తున్న నేపథ్యంలో అప్పుల వినియోగం ఉత్పాదక రంగాలకు మళ్లాలి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పుల భారం 28.7 శాతానికి చేరుతుందని బడ్జెట్ అంచనాలు సూచిస్తున్నాయి. వడ్డీలు, అప్పుల చెల్లింపుల కోసం భవిష్యత్తులో మరింత ఆదాయం వెచ్చించాల్సి వస్తే అభివృద్ధి పనులకు నిధులు తగ్గే ప్రమాదం ఉంది.

ఉచిత పథకాల అమలులో పారదర్శకత కూడా అవసరం. బోగస్ లబ్ధిదారులు, మధ్యవర్తులు, అనవసర ప్రచార వ్యయాలకు అడ్డుకట్ట వేయాలి. ప్రతి పథకానికి సామాజిక ఆడిట్ నిర్వహించి, ఎంత ఖర్చు చేశారు? ఎంతమంది లబ్ధి పొందారు? పేదరికం ఎంత తగ్గింది? ఉపాధి ఎంత పెరిగింది? అనే వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. నగదు సాయంతో పాటు మహిళలకు స్వయం ఉపాధి, యువతకు నైపుణ్య శిక్షణ, రైతులకు ఆధునిక పరికరాలు, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలి. ఉచిత బస్సుల కంటే మెరుగైన రవాణా వ్యవస్థ, ఉచిత విద్యుత్తుతో పాటు నాణ్యమైన నిరంతర విద్యుత్తు, నగదు సాయంతో పాటు శాశ్వత ఆదాయ మార్గాలు కల్పించాలి. సంక్షేమం చేయూతనివ్వాలి, అభివృద్ధి ఎదగడానికి బాట వేయాలి. ప్రజాధనం తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకు కాకుండా, తెలంగాణ భవిష్యత్తును నిర్మించే పెట్టుబడిగా మారాలి.

– కొలను వెంకటేశ్వర రెడ్డి
ఎస్పీ రిటైర్డ్, తెలంగాణ జైల్స్



కాలుష్య కాసారంగా జవహర్‌నగర్

- డంపింగ్ యార్డ్ ను వెంటనే ఎత్తివేయాలి
- డంపింగ్ భూతానికి బలైన జవహర్ నగర్ ను ఆదుకోవాలి
- పోరాట కమిటీ దీక్షకు టీచర్స్ ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు
- తెలంగాణ ఉద్యమ జేఏసీ చైర్మన్ తుమ్మల ప్రపోల్ రామ్ రెడ్డి, ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధ



జవహర్ నగర్, నేడు న్యూస్: కాలుష్య కాసారంగా మారిన జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను వెంటనే ఎత్తివేయాలని, డంపింగ్ భూతానికి బలైన జవహర్ నగర్ ను అన్ని విధాల ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ తుమ్మల ప్రపోల్ రామ్ రెడ్డి, ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధ లు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును ఎత్తివేసేంతవరకు ఆందోళన కార్యక్రమాలను



మరింత విస్తృత పరుస్తామని, దశలవారీగా ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని వారు హెచ్చరించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో నెలకొని ఉన్న డంపింగ్ యార్డ్ ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ చెన్నాపురం చౌరస్తా వద్ద డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని తుమ్మల ప్రపోల్ రాంరెడ్డి, ఐఎఫ్టియు ఉపాధ్యక్షురాలు అనురాధ, ఏ ఐ ఎఫ్ టి యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రెల్లి మల్లేష్, శివ బాబు, పోరాట కమిటీకి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఈ సందర్భంగా తుమ్మల ప్రపోల్ రాంరెడ్డి, అనురాధ, ఎర్రెల్లి మల్లేష్ లు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ కారణంగా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమై పోయాయని, తాగునీరు సాగునీరు విషతుల్యంగా మారిందని తెలిపారు. కాలుష్య ప్రభావంతో ఇక్కడి ప్రజల సగటు ఆయు ప్రమాణం తగ్గిపోయి 60 ఏళ్ల నిండకముందే మృత్యువాత పడుతున్నారని ఇటీవల కాలంలోనే సుమారు ఆరుగురు మరణించడం బాధాకరమన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న డంపింగ్ యార్డ్ ను వెంటనే తరలించి జవహర్ నగర్ వాసులకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకన్న, ఏఐఎఫ్టీయూ మల్లేష్, నాయకులు శివ బాబు, దుర్గయ్య, సురేందర్, సావిత్రి, ప్రముఖ రచయిత, ప్రజా గాయకుడు దామరపల్లి నర్సింహారెడ్డి, పలు ప్రజాసంఘాల నాయకులు స్థానికులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ ప్రజల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

- రూ.303 కోట్ల అభివృద్ధి నిధులకు కేంద్రం వెంటనే అనుమతులు ఇవ్వాలి
- ఎంపీ ఈటల రాజేందర్ ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో స్పందించాలి: కాంగ్రెస్ నాయకులు

సికింద్రాబాద్, నేడు న్యూస్: కంటోన్మెంట్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ నాయకులు కంటోన్మెంట్ ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు.నవ కంటోన్మెంట్ నిర్మాణంలో భాగంగా మంగళవారం వార్డు నంబర్ 7 పరిధిలోని సెంట్రల్ బ్యాటరీ బస్తీలో నాయకులు పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారు వెయ్యి కుటుంబాలు నివసిస్తున్న ఈ ప్రాంతంలో సరైన రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.డిఫెన్స్ ల్యాండ్ పేరుతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. దేశ పౌరులుగా జీవిస్తున్న ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. 2020లో జరగాల్సిన కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు ఇప్పటికీ నిర్వహించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ, కంటోన్మెంట్ బోర్డు నుంచి ఎన్ఓసీ లభించక పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. అలాగే సెంట్రల్ బ్యాటరీ, సాయిబాబా హట్స్, చిన్న కమ్మెల, 108 బజార్, బోయినపల్లి, మడ్‌ఫోర్ట్ తదితర ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.303 కోట్ల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేసిందని తెలిపారు. ఎక్స్‌ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ ప్రక్రియతో పాటు కేంద్ర రక్షణ శాఖ నుంచి రావాల్సిన అనుమతులు



పెండింగ్‌లో ఉండటంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందని అన్నారు.ఈ విషయంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కంటోన్మెంట్‌కు పర్యటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.303 కోట్ల అభివృద్ధి నిధులు, ఎక్స్ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ ప్రక్రియకు సంబంధించి ఢిల్లీ, పూణేలోని సంబంధిత రక్షణ శాఖ అధికారులతో మాట్లాడి తక్షణ అనుమతులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.డిఫెన్స్, ఏవియేషన్ భూముల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా ఇతర ప్రాంతాల మాదిరిగానే రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీరు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలని కోరారు. కంటోన్మెంట్ బోర్డు సీఈఓ, సంబంధిత బ్రిగేడియర్ వెంటనే స్పందించి అభివృద్ధి పనులకు ఉన్న అడ్డంకులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ మురళి ముదిరాజ్, ఫోక్స్‌పర్సన్ నాగినేని సరిత, నాయకులు రవీందర్ గుప్తా, ప్రదీప్ చోటు, శ్యామ్, శ్రీనివాస్, రాజేందర్, నిర్మలమ్మ తదితరులు, స్థానిక బస్తీ వాసులు పాల్గొన్నారు.

మరిపడిగలో కార్తీక పౌర్ణమి వేడుకలు

- శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి
- స్వామివారికి రుద్రాభిషేకం, జెండా ఆవిష్కరణ
- సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

గుండాల, నేడు న్యూస్: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మరిపడిగ గ్రామంలో కొలువుతీరిన స్వయంభు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం కార్తీక శోభతో వెల్లివిరిసింది. కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించారు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషే





కాన్ని నిర్వహించారు. అలాగే జెండా ఆవిష్కరణ అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా కార్తీక పౌర్ణమి వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మరిపడిగ గ్రామ సర్పంచ్ గూడెపు కుమార్, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు, వార్డు సభ్యులు, భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సాగుకు విరామం సరే..

రైతుకు ఆర్థిక భరోసా ఏదీ?

ఎల్‌నినో ప్రభావంతో తగ్గిన వర్షాలు.. అడుగంటుతున్న జలవనరులు

రెండో పంట వద్దంటున్న పాలకులు.!

రైతుల కుటుంబాల ఆదాయానికి ప్రత్యామ్నాయం ఏది?

సాగు విరామానికి పరిహారం ఎక్కడ.?

వ్యవసాయం ప్రకృతితో ముడిపడిన జీవన విధానం. వాన పడితేనే విత్తనం మొలకెత్తుతుంది.. నీరు అందితేనే పంట ఎదుగుతుంది.. దిగుబడి వస్తేనే రైతు కుటుంబానికి ఆదాయం సమకూరుతుంది. కానీ వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం వ్యవసాయ రంగాన్ని మరో సంక్షోభంలోకి నెడుతోంది. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. ఫలితంగా సాగునీటి లభ్యతపై అనిశ్చితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో రెండో పంట సాగును తగ్గించాలని, ముఖ్యంగా వరి సాగుకు దూరంగా ఉండాలని పాలకులు సూచిస్తున్నారు. నీటిని పొదుపు చేసుకోవాల్సిన అవసరాన్ని ఎవరూ కాదనలేరు. భవిష్యత్తు తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకోవాల్సిందే. కానీ నీటి కొరతకు పరిష్కారంగా రైతును సాగుకు దూరం చేయడమే మార్గమా? రెండో పంట వేయవద్దంటే రైతు కుటుంబాలు ఎలా బతకాలి? పంట వేయకపోయినా అప్పుల వడ్డీలు, కుటుంబ ఖర్చులు ఆగవు కదా! నీటిని కాపాడుకోవాలనే ఆలోచనలో రైతు జీవనాధారాన్ని విస్మరిస్తే వ్యవసాయ సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

హైదరాబాద్ నేడు ప్రతినిధి: వ్యవసాయాన్ని బయట నుంచి చూసేవారికి రెండో పంట అదనపు సాగుగా కనిపించవచ్చు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నం. అనేక రైతు కుటుంబాలకు రెండో పంటే ఏడాది పొడవునా ఆర్థిక అవసరాలను తీర్చే ఆధారం. మొదటి పంట కోసం చేసిన పెట్టుబడులు, విత్తనాలు, ఎరువు లు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, యంత్రాల అద్దెలు, అప్పుల వడ్డీలు.. ఇవన్నీ పోను రైతు చేతిలో మిగిలేది ఎంత? ప్రకృతి అనుకూలించినా గిట్టుబాటు ధర లభిస్తుందనే హామీ లేదు. దిగుబడి పెరిగితే ధర పడిపోతుంది. ధర పెరిగే సమయానికి రైతు చేతిలో పంట ఉండదు. ఈ మార్కెట్ పరిస్థితుల్లో రెండో పంట ద్వారా వచ్చే ఆదాయం రైతుకు ఎంతో కీలకం. పిల్లల చదువులు, కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు, వ్యవ సాయ రుణాల చెల్లింపులు.. ఇలా ప్రతి అవసరానికీ రైతు రెండో పంట ఆదాయంపై ఆధారపడుతున్నాడు. అలాంటప్పుడు రెండో పంట వద్దంటే ఆ ఆదాయ లోటును ఎవరు భర్తీ చేస్తారు? నీటి పొదుపు కోసం రైతు ఒక పంటను వదులుకోవాలంటే, అతడి కుటుం బాన్ని ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే కాదా? రైతు త్యాగాన్ని ఆశించే పాలకులు అతడి నష్టాన్ని భర్తీ చేసే బాధ్యత నుంచి తప్పించుకోకూడదు.

నీటి సంక్షోభానికి బాధ్యత ఎవరిది?

జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడం ఒక్కరోజులో జరిగిన పరిణామాలు కావు. చెరువుల పూడికతీతలో నిర్లక్ష్యం, జలవనరుల ఆక్రమణలు, కాలువల నిర్వహణలో లోపాలు, వర్షపు నీటిని నిల్వ చేసుకునే నిర్మాణాల కొరత వంటి సమస్యలు ఏళ్లుగా కొనసాగుతున్నాయి. వీటిపై సమగ్ర సమీక్ష లేకుండా నీటి వినియోగాన్ని తగ్గించుకోవాలని రైతులకు మాత్రమే సూచించడం ఎంతవరకు సమంజసం? పట్టణాల్లో నీటి వృథాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి? పరిశ్రమల్లో వినియోగించిన నీటిని శుద్ధి చేసి తిరిగి ఉపయోగించే వ్యవస్థ ఎంతవరకు అమలవుతోంది? ఆక్రమణలకు గురైన చెరువులను పునరుద్ధరించేందుకు కార్యాచరణ ఏమిటి? కాలువల్లో నీటి వృథాను అరికట్టేందుకు ఆధునిక సాంకేతికతను ఎందుకు విస్తరించలే కపోతున్నాం? నీటి సంరక్షణ అనేది కేవలం వ్యవసాయ రంగానికి సంబం ధించిన అంశం కాదు. పట్టణాలు, పరిశ్రమలు, వ్యవసాయం అన్నింటికీ సమాన బాధ్యత ఉంది. నీటి కొరత వచ్చినప్పుడు సాగు తగ్గించడం తాత్కాలిక పరిష్కారం కావచ్చు. కానీ చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌ల పునరుద్ధరణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పునర్భరణ, కాలువల ఆధునికీకరణ వంటి చర్యలే శాశ్వత పరిష్కారానికి పునాది కావాలి.

కౌలు రైతుల పరిస్థితి ఏమిటి ?

సొంత భూమి ఉన్న రైతులే పెట్టుబడుల భారంతో సతమతమవుతుంటే కౌలు రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. ముందుగానే కౌలు చెల్లించి, పెట్టుబడుల కోసం అప్పులు తెచ్చి సాగు చేస్తున్నారు. పంట నష్టపోతే పరిహారం అందక, ధర పడిపోతే నష్టాన్ని భరించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇప్పుడు రెండో పంట వద్దంటే వారి పరిస్థితి ఏమిటి? పంట వేయకపోయినా భూ యజమానికి కౌలు చెల్లించాలి. అప్పులకు వడ్డీలు కట్టాలి. కుటుంబాన్ని పోషించాలి. సాగు చేయని భూమి నుంచి ఆదాయం రాకపోయినా బాధ్యతలు మాత్రం తగ్గవు. భూమి ఎవరి పేరున ఉందన్నది కాదు.. సాగు చేస్తున్నదెవరు? పెట్టుబడి పెడుతున్నదెవ రు? నష్టాన్ని భరిస్తున్నదెవరు? అన్నది ప్రభుత్వం గుర్తించాలి. కౌలు రైతులను కూడా సాగు విరామ పరిహారం, ప్రత్యామ్నాయ ఆర్థిక సాయం పరిధిలోకి తీసుకురావాలి.

మార్కెట్ భరోసా కల్పించేదెవరు?

వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడం మంచి ఆలోచనే. అయితే పంట మార్చడం అంటే విత్తనం మార్చడం మాత్రమే కాదు. రైతు పెట్టుబడి, సాగు పద్ధతి, దిగుబడి, మార్కెట్ అన్నీ మారతాయి. ప్రత్యామ్నాయ పంటకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, పెట్టుబడి సాయం అందించాలి. ముఖ్యంగా పండించిన దిగుబడికి కొను గోలు భరోసా కల్పించాలి. వరి వేయవద్దని చెప్పే ముందు ప్రత్యామ్నాయ పంటకు మార్కెట్ ఉందా? పండిన ఉత్పత్తిని ఎవరు కొనుగోలు చేస్తారు? ఏ ధరకు కొనుగోలు చేస్తారు? నిల్వ, రవాణా, ప్రాసెసింగ్ సదుపాయాలు ఉన్నాయా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. మార్కెట్ హామీ లేకుండా పంట మార్పును ప్రోత్సహిస్తే రైతు ఒక సమస్య నుంచి మరో సమస్యలోకి వెళ్లే ప్రమాదం ఉంది.



ప్రాంతాలవారీగా నేల స్వభావం, వాతావరణం, నీటి లభ్యత, మార్కెట్ అవసరాలను విశ్లేషించి పంటల ప్రణాళిక రూపొందించాలి. తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే పంటలను గుర్తించి ప్రోత్సహించాలి. పంటల వైవిధ్యీకరణను రైతు ఆదాయ పెంపుతో అనుసంధానించాలి. ఉ త్పత్తుల నిల్వ, విలువ జోడింపు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలి.

నీటి పొదుపునకు సాంకేతికతను చేరువ చేయాలి!

రైతును సాగుకు దూరం చేయడం కంటే అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించేలా చేయడం ముఖ్యం. బిందు, తుంపర సేద్యం, మల్చింగ్, సేంద్రియ పదార్థాల వినియోగం ద్వారా నీటి అవసరాన్ని తగ్గించవచ్చు. పంట అవసరాన్ని బట్టి నీటిని అందించే శాస్త్రీయ పద్ధతులను రైతులకు పరిచయం చేయాలి. ముఖ్యంగా ఉ ద్యాన పంటల్లో నీటి యాజమాన్యానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. పంట వయస్సు, నేల స్వభావం, వేర్ల విస్తరణ, వాతావరణ పరిస్థితులను బట్టి నీటిని అందించాలి. నేలలో తేమను గుర్తించే సెన్సార్లు, ఆటోమేటెడ్ సేద్య పరికరాలను చిన్న, సన్నకారు రైతులకు రాయితీలతో అందుబాటులోకి తేవాలి. వ్యవసాయ విస్తరణ సేవలను బలోపేతం చేసి గ్రామస్థాయిలోనే రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలి.

సాగు విరామం తప్పనిసరైతే పరిహారం ఇవ్వాల్సిందే !

నీటి లభ్యత తీవ్రంగా తగ్గిన ప్రాంతాల్లో రెండో పంట సాగును పరిమితం చేయాల్సిన పరిస్థితులు రావచ్చు. అయితే అలాంటి నిర్ణయాలు రైతులతో చర్చించి, నీటి నిల్వలు, తాగునీటి అవసరా లు, సాగునీటి లభ్యతను శాస్త్రీయంగా అంచనా వేసిన తర్వాతే తీసుకోవాలి. ప్రాంతాలవారీగా నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలి. రెండో పంటకు విరామం తప్పనిసరి అయితే రైతులకు ఎకరాకు తగిన పరిహారం అందించాలి. కౌలు రైతులను గుర్తించి వారికి కూడా ఆర్థిక సాయం కల్పించాలి. పంట రుణాల చెల్లింపులకు వెసులుబాటు ఇవ్వాలి. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా అదనపు పని దినాలు కల్పించే అవకాశాలను పరిశీలించాలి. రైతు కుటుంబాల ఆదాయ నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక సహాయక పథకాన్ని రూపొందించాలి. రైతు సాగు చేయకపోతే ప్రభుత్వానికి నీరు ఆదా అవుతుంది. కానీ రైతుకు ఆదాయం పోతుంది. ఈ రెండు అం శాల మధ్య సమతుల్యత సాధించాల్సిన బాధ్యత ప్రభు త్వానిదే. నీటి సంరక్షణ కోసం రైతు సహకారం కోరే పాలకులు, ఆ సహకారం వల్ల రైతుకు కలిగే నష్టాన్ని కూడా గుర్తించాలి. త్యాగం చేయాలని చెప్పే ముందు ఆ త్యాగానికి తగిన భరోసా కల్పించాలి.

సాగు తగ్గితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకూ దెబ్బే !

వ్యవసాయం నిలిచిపోతే ప్రభావం ఒక్క రైతు కుటుంబానికే పరిమితం కాదు. వ్యవసాయ కూలీలకు పని తగ్గుతుంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారాలు మందగిస్తాయి. యంత్రాల అద్దెలు, రవాణా, మిల్లింగ్ వంటి అనుబంధ రంగాల కార్యకలాపాలు తగ్గుతాయి. రైతుల కొనుగోలు శక్తి పడిపోవడంతో గ్రామాల్లోని చిన్న వ్యాపారాలపైనా ప్రభావం పడుతుంది. ఉపాధి కోసం పట్టణాలకు వలసలు పెరిగే అవకాశం ఉంది. అంటే రెండో పంట విరామం అనేది కేవలం పొలంలో పంట వేయకపోవడం కాదు. దాని ప్రభావం గ్రామీణ ఉపాధి, కుటుంబ ఆదాయాలు, స్థానిక ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ఈ అంశాలను పరిగణన లోకి తీసుకోకుండా తీసుకునే నిర్ణయాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేవు.

రైతు భాగస్వామ్యం లేకుండా వ్యవసాయ ప్రణాళికలు వద్దు!

ప్రతి ప్రాంతానికి నీటి లభ్యత, నేల స్వభావం, పంటల అనుకూలత వేర్వేరు గా ఉంటాయి. ఒకే విధమైన నిర్ణయాలను అన్ని ప్రాంతాలకూ వర్తింప జేయడం వల్ల సమస్యలు తలెత్తవచ్చు. వ్యవసాయ, సాగునీటి శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు సమన్వయం తో పనిచేయాలి. గ్రామస్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి నీటి లభ్యత, పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై చర్చించాలి. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి కార్యాచరణ రూపొందించాలి. రైతులను కేవలం ప్రభుత్వ సూచనలు పాటించే వారిగా కాకుండా వ్యవసా య విధానాల రూపకల్పనలో భాగస్వాములుగా గుర్తించాలి. ఎందుకంటే పంటపై అనుభవం రైతుకు ఉన్నంతగా మరెవరికీ ఉండదు.

నీటి వనరులను కాపాడాలి.. రైతును నిలబెట్టాలి !

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగానికి సవా ళ్లు విసురుతున్నాయి. వీటిని ఎదుర్కొనేందుకు తాత్కాలిక సాగు నియం త్రణ చర్యలతో సరిపెట్టకుండా దీర్ఘకాలిక జల నిర్వహణ విధానాన్ని రూపొందించాలి. జలవనరుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు, ఆధునిక సేద్యం, పంటల వైవిధ్యీకరణ, మార్కెట్ భరోసా, రైతు ఆదాయ భద్రత.. అన్నింటినీ ఒకే ప్రణాళికలో భాగం చేయాలి. రెండో పంట వద్దంటే రైతు కుటుంబానికి ప్రత్యామ్నాయ ఆదాయం చూపాలి. కౌలు రైతులకు అండగా నిలవాలి. ప్రత్యామ్నాయ పంటలకు కొనుగోలు హామీ ఇవ్వాలి. నీటిని ఆదా చేసే సాంకేతికతను ప్రతి రైతుకూ చేరువ చేయాలి. సాగు విరామంతో నష్టపోయే రైతులకు తగిన పరిహారం అందించాలి. ప్రకృతి వైపరీత్యాల భారాన్ని రైతు ఒక్కడే మోయలేడు. నీటి కొరతను అధి గమించేందుకు రైతుల సహకారం అవసరమే. కానీ ఆ బాధ్యతను రైతుపైనే మోపడం సరికాదు. పాలకుల విధానాల్లోనూ, జల నిర్వహణలోనూ, నీటి వినియోగంలోనూ బాధ్యతాయుతమైన మార్పు రావాలి. నీటిని కాపాడుకో వడం భవిష్యత్తు అవసరం.. రైతును కాపాడుకోవడం వర్తమాన బాధ్యత. సాగుకు విరామం కోరే ముందు రైతు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలి. ఎందుకంటే నీరు ఉంటేనే పంట.. పంట ఉంటేనే రైతుకు ఆదాయం.. రైతు బతికితేనే గ్రామీ ణ ఆర్థిక వ్యవస్థకు మనుగడ! సాగును ఆపమనే ఆదేశం కంటే.. రైతు నష్టాన్ని భర్తీ చేసే భరోసా ముఖ్యం. నీటి సంరక్షణ పేరుతో అన్నదాత ఆర్థిక భద్రతను బలిపెట్టకూడదు!



జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు



‘సర్’ ప్రక్రియతో ఓటు హక్కును కాలరాస్తున్న బీజేపీ

కేంద్ర ప్రభుత్వంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు

కరీంనగర్ : రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన అమూల్యమైన ఓటు హక్కును కాలరాసే విధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ‘సర్’ ప్రక్రియ పేరుతో ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ‘సర్’ ప్రక్రియ పేరుతో ఓటు హక్కును ప్రభావితం చేసే విధానాలను అనుసరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు.



జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు
చొప్పదండి విద్యార్థి ఎంపిక

కరీంనగర్ : జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు చొప్పదండి ప్రాంతానికి చెందిన విద్యార్థి ఎంపిక కావడం పట్ల పాఠశాల వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ పాఠశాల, దుర్కాపూర్‌కు చెందిన 12వ తరగతి విద్యార్థి క్యాడెట్ బెంజమిన్ జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో బెంజమిన్ పాల్గొననున్నాడు. చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం విద్యార్థి కృషి, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది. పాఠశాలలో అందిస్తున్న ప్రోత్సాహం, క్రీడా సాధన ద్వారా విద్యార్థులు వివిధ స్థాయిల్లో ప్రతిభను చాటుకుంటున్నారని ఈ సందర్భంగా పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. బెంజమిన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విషయం తెలుసుకున్న పాఠశాల డైరెక్టర్ కల్వల రాజదత్త, ప్రిన్సిపల్ పి. దేవేందర్, సీనియర్ వైస్ ప్రిన్సిపల్ కె. శ్రీనివాస్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ సి. ప్రమోద్ రాజా విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.



కొండగట్టులో భక్తుల ప్రత్యేక ఆకర్షణగా ‘సీతమ్మ బావి’

కరీంనగర్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల విశేష ఆకర్షణగా నిలుస్తున్న సీతమ్మ బావి మరోసారి భక్తుల సందడితో పులకించింది. కొండగట్టు గిరిప్రదక్షిణ కార్యక్రమంలో భాగంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సీతమ్మ బావిని దర్శించుకోవడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తులు ప్రత్యేకంగా సీతమ్మ బావి వద్దకు చేరుకుని అక్కడి నీటిని తలపై చల్లుకుంటూ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. కొండగట్టు క్షేత్రానికి వచ్చే భక్తులకు శ్రీ ఆంజనేయస్వామి దర్శనం ఎంత ముఖ్యమో, క్షేత్ర పరిసరాల్లో ఉన్న పలు పవిత్ర ప్రదేశాలను సందర్శించడం కూడా అంతే ప్రత్యేకతను కలిగి ఉంది. అందులో సీతమ్మ బావికి విశిష్ట స్థానం ఉంది. ఎన్నో ఏళ్లుగా ఈ బావి ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరిం చుకుని భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. కొండగట్టు గిరిప్రదక్షిణ సందర్భంగా భక్తులు ఈ బావిని దర్శించుకోవడం ఒక ప్రత్యేక ఆచారంగా కొనసాగుతోంది.



లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం

ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి..

పెద్దపల్లి, నవంబర్ 24 : పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ.లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఆశీర్వచనాలు అందజేశారు.ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. దేవునిపల్లి గ్రామంతో పాటు పెద్దపల్లి నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరిపై ఆ లక్ష్మీనరసింహస్వామి వారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలకూ విలువ లేకపోతే..
ప్రజాస్వామ్యంలో న్యాయం ఎక్కడ?
అధికార అహంకారమా? రాజ్యాంగ ధిక్కారమా?

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ప్రజల ఓట్లతో అధికారంలోకి వస్తాయి. కానీ అధికారంలోకి వచ్చినంత మాత్రాన చట్టానికి అతీతమవ్వవు. రాజ్యాంగం ప్రభుత్వాలకు అధికారాన్ని ఇచ్చినట్లే, ఆ అధికారానికి హద్దులు కూడా విధించింది. ఆ హద్దులను నిర్దేశించే అత్యున్నత సంస్థ సుప్రీంకోర్టు. అలాంటి న్యాయస్థానం ఆదేశాలను ప్రభుత్వమే అమలు చేయకపోతే, సామాన్య పౌరుడికి చట్టంపై విశ్వాసం ఎలా నిలుస్తుంది?



తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించే వివాదం ఇప్పుడు ఈ ప్రశ్నను దేశం ముందుంచింది. భక్తుల విశ్వాసానికి సంబంధించిన అంశంపై సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి, నిర్దిష్ట ప్రదేశంలో దీపం వెలిగించేందుకు అనుమతించింది. ఇతర ప్రార్థనా స్థలాలకు ఇబ్బంది కలగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. అంటే, మతసామరస్యానికి భంగం కలగకుండా భక్తుల ఆకాంక్ష నెరవేర్చేందుకు న్యాయస్థానం మార్గం చూపింది.

అయితే, ఆ ఆదేశం అమలులో ప్రభుత్వ వైఖరి తీవ్ర విమర్శలకు దారితీసింది. కోర్టు అనుమతించిన ప్రదేశంలో సంప్రదాయ దీపం వెలిగించకుండా, మరోచోట దీపం వెలిగించి సరిపెట్టడం ఏ రకమైన అమలు? భక్తులు కోరింది విద్యుత్ బల్బు కాంతి కాదు. నూనె, వత్తితో వెలిగించే సంప్రదాయ జ్యోతి. దీపతూణ్ వద్ద దీపం వెలిగించమంటే, మరోచోట విద్యుత్ వెలుగు చూపించడం ఆదేశాన్ని అమలు చేయడమా, లేక దాని ఉద్దేశాన్ని దాటవేయడమా? ఇలాంటి చర్యలు ప్రజల్లో ప్రభుత్వ ఉద్దేశాలపై అనుమానాలు కలిగిస్తాయి.

సుప్రీంకోర్టు ఆదేశం ప్రభుత్వానికి నచ్చకపోవచ్చు. దానిపై సమీక్ష కోరవచ్చు. కానీ సమీక్ష పిటిషన్ దాఖలు చేయడం ఆదేశాల అమలును నిలిపివేయదు. కోర్టు ప్రత్యేకంగా నిలిపివేయనంతవరకు ఆదేశాలను పాటించాల్సిందే. అధికారుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా న్యాయస్థాన ఉత్తర్వులను మార్చుకునే వీలుంటే, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు అర్థమేముంటుంది? ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు తదుపరి చర్యలు కీలకం. ఆదేశాల అమలులో వైఫల్యానికి బాధ్యులైన అధికారుల నుంచి వివరణ కోరాలి. ఉద్దేశపూర్వక ధిక్కరణ జరిగిందని నిర్ధారణ అయితే, చట్టం అనుమతించే కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలకు కూడా చట్టం పట్ల జవాబుదారీతనం ఉందని నిరూపించాలి.

న్యాయస్థానాల ఆదేశాలను పట్టించుకోకపోవడం ఒక ప్రభుత్వానికి తాత్కాలిక రాజకీయ ప్రయోజనం కలిగించవచ్చు. కానీ ప్రజల్లో ప్రభుత్వం సుప్రీంకోర్టు కంటే శక్తివంతమైనదా? అనే భావన కలిగితే, అది దేశ రాజ్యాంగ వ్యవస్థకే ప్రమాదం. న్యాయస్థానం గౌరవం వ్యక్తుల గౌరవం కాదు, అది రాజ్యాంగ గౌరవం.

ప్రభుత్వాలు మారుతాయి. అధికారాలు మారుతాయి. కానీ చట్టం ఎవరి రాజకీయ పంతానికీ బానిస కాకూడదు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించిన వారికి పదవి రక్షణ కవచం కాకూడదు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చట్టమే చర్య తీసుకోవాలి.

తిరుప్పరంకుండ్రం వివాదానికి పరిష్కారం ఒక దీపం వెలిగించడమే కాదు. న్యాయస్థాన ఆదేశాలను ఉల్లంఘిస్తే పరిణామాలు తప్పవనే రాజ్యాంగ సందేశం దేశంలోని ప్రతి ప్రభుత్వానికి చేరాలి. అదే సుప్రీంకోర్టు గౌరవాన్ని నిలబెట్టే మార్గం. అదే ప్రజాస్వామ్యానికి నిజమైన వెలుగు.



కొలను వెంకటేశ్వర రెడ్డి
ఎస్పీ రిటైర్డ్, తెలంగాణ జైల్స్

రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య
విలువలను కాపాడుకుందాం

- **26న జరిగే సంవిధాన్ రక్షామార్చ్‌ను విజయవంతం చేద్దాం**
- **ప్రతి డివిజన్ నుంచి కనీసం వంద మంది తరలిరావాలి**
- **డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపు**
- **సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్**



బోడుప్పల్, నేడు ప్రతినిధి: రాజ్యాంగ పరిరక్షణ ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో భాగంగా చేపట్టిన సంవిధాన్ రక్షా మార్చ్ ను విజయవంతం చేద్దామని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వదిలేసి యాదవ్ కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా పరిధిలోని డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంవిధాన్ రక్షా కార్యక్రమంలో భాగంగా నవంబర్ 26న హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నారన్నారు. లిబర్టీ సర్కిల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగనుందని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే లక్ష్యంగా చేపట్టిన సంవిధాన్ రక్షా మార్చ్‌ను విజయవంతం చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలని, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీసీసీ జిల్లా మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఇంచార్జి కొలను హనుమంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ యాదవ్, జిల్లా డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లి మెడికల్ కళాశాల విద్యార్థుల నిరసన విరమణ

కరీంనగర్ : కొత్తపల్లి ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన మూడు రోజుల నిరసన కార్యక్రమం మంత్రి దామోదర రాజనర్సింహా ప్రకటనతో ముగిసిం ది. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, హాస్టల్ వసతి సదుపాయాలతో పాటు కళాశాల భవన నిర్మాణ పనులపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో విద్యార్థులు తమ ఆందోళనను విరమించుకున్నారు. బుధవారం నుంచి యథావిధిగా తరగతులకు హాజరవుతామని విద్యార్థులు ప్రకటించారు. కొత్తపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గత మూడు రోజులుగా నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ముఖ్యంగా విద్యార్థులకు అవసరమైన వసతి సదుపాయాలు, బాలికలు, బాలురకు ప్రత్యేక హాస్టళ్ల ఏర్పాటు, కళాశాలకు సంబంధించిన భవన నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలపై విద్యార్థులు తమ ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగిస్తామని విద్యార్థులు పట్టుబట్టారు.



భక్తజనసంద్రంగా నృసింహుడి కొండ

కార్తీక పౌర్ణమి.. నృసింహ క్షేత్రంలో భక్తి వైభవం

జూలపల్లి, నవంబర్ 24 : కార్తీక పౌర్ణమి పర్వదినం పెద్దాపూర్ శ్రీ యోగానంద లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో భక్తి పరవశాన్ని నింపింది. జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామ శివారులో ప్రకృతి ఒడిలో కొలువుదీరిన స్వామివారి క్షేత్రం సోమవారం వేలాది మంది భక్తుల రాకతో భక్తజనసంద్రంగా మారింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని తొమ్మిదోసారి నిర్వహించిన గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో సుమారు 6 వేల మంది భక్తులు పాల్గొనడం విశేషం. తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి కొండ చుట్టూ ప్రదక్షిణలు నిర్వహిస్తూ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోవింద నామస్మరణలు, నృసింహస్వామి నామ సంకీర్తనలతో కొండ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రకృతి సౌందర్యం మధ్య దక్షిణాభిముఖంగా యోగముద్రలో స్వయంభువుగా వెలిసిన శ్రీ యోగానంద లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రం భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా, ఆపదలో అండగా నిలిచే ఆరాధ్య స్వామిగా భక్తులు విశ్వసిస్తూ నిత్యం దర్శించుకుంటున్నారు.

గిరి ప్రదక్షిణకు పెరుగుతున్న ఆదరణ

ప్రతి నెల పౌర్ణమి రోజున నిర్వహించే గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తూ విశేష ఆదరణ పొందుతోంది. ఈ క్షేత్ర విశిష్టతను విస్తృతంగా భక్తులకు పరిచయం చేయడంలో కొండగట్టు గిరి ప్రదక్షిణ సంకల్పకర్త సురేష్ ఆత్మారాం మహారాజ్ గురూజీ పాత్ర ప్రత్యేకంగా నిలిచింది. గతంలో నిర్వహించిన ఏడో, ఎనిమిదో గిరి ప్రదక్షిణ కార్యక్రమాల్లో పాల్గొని, గిరి ప్రదక్షిణ ప్రాముఖ్యతను భక్తులకు వివరించడంతోపాటు ఆధ్యాత్మికంగా ప్రోత్సహించారు. ఎనిమిదో గిరి ప్రదక్షిణ సందర్భంగా పెద్దాపూర్ నృసింహస్వామి ఆలయం నుంచి కొండగట్టు వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, కొండగట్టు గిరి ప్రదక్షిణలోనూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా పెద్దాపూర్ నృసింహస్వామి క్షేత్ర విశిష్టత మరింత విస్తృతంగా ప్రచారంలోకి వచ్చి, ఇతర ప్రాంతాల భక్తులను ఆకర్షించింది.

కరీంనగర్‌లోని రామనగర్‌లో సత్యనారాయణ స్వామి
ఆలయంలో భక్తుల సందడి



కరీంనగర్ : కార్తీక మాసం సందర్భంగా కరీంనగర్ రామనగర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయం, శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాస పవిత్రతను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతోంది. కార్తీక మాసం ప్రారంభం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వస్తున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. కార్తీక మాసంలో పూజలు నిర్వహించడం విశేష ఫలప్రదమని భావించే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు కల్పిస్తున్నారు. పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నవంబర్ 10వ తేదీ నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. అదేవిధంగా కార్తీక మాసంలోని విశేష పర్వదినాలను పురస్కరించుకుని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

‘మెగావర్స్’ ప్రోమోతో
ఫుల్ జోష్‌లో ఫ్యాన్స్

దాదాపు ఐదు దశాబ్దాలుగా వెండితెరపై ప్రేక్షకులను అలరిస్తున్న మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు ఓటీటీలో కొత్త అవతార్ ఎత్తబోతున్నారు. నెట్‌ఫ్లిక్స్ కోసం ఆయన హోస్ట్‌గా చేస్తున్న తొలి సెలబ్రిటీ టాక్‌షో ‘చిరంజీవిన్ మెగావర్స్’. ఇప్పటికే ఈ విషయం అధికారిక ప్రకటన విడుదలై.. ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచగా.. తాజాగా, నెట్‌ఫ్లిక్స్ ప్రోమోను విడుదల చేసి మెగా ఫ్యాన్స్‌లో జోష్ నింపారు. సినిమాల్లో చిరంజీవి 48 ఏళ్ల ప్రయాణాన్ని గుర్తుచేస్తూ, ‘Chira_jeevi’ పేరులో ‘N’ అక్షరం మిస్ అవ్వడం అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో ఈ ప్రోమోను కట్ చేశారు. ఆ ‘N’ నెట్‌ఫ్లిక్స్ ద్వారా వచ్చి చేరుతుందనేలా చూపిస్తూ, చివర్లో చిరంజీవి చెప్పిన ‘ఇది నా అడ్డా’ డైలాగ్ ఫ్యాన్స్‌ను బాగా ఆకట్టుకుంటోంది. మెగాస్టార్ ఇమేజ్‌ను దాటి, చిరంజీవిలోని సరదా, మెగా ముచ్చట్లు ఒకే చోట చూడబోతున్నారని టీమ్ చెబుతోంది. మెగావర్స్‌తో చిరంజీవి నెట్‌ఫ్లిక్స్ విశ్వంలోకి అడుగుపెట్టబోతున్నట్లు తెలిపారు. సినిమా, క్రీడలు, పాపులర్ కల్చర్‌కు చెందిన ప్రముఖులతో చిరంజీవి ముచ్చటించబోతున్నారు. ఈ షోలో కమల్ హాసన్, నాగార్జున, ప్రభాస్, బ్రహ్మానందం, సందీప్ రెడ్డి వంగా, రవితేజ, నాని, బాబీ కొల్లి వంటి ప్రముఖులు కనిపించనున్నట్లు సమాచారం. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆటమ్ మీడియా వెంచర్స్, సోల్ ప్రొడక్షన్ ఎల్ఎల్పీ నిర్మిస్తున్న ఈ షో, నవంబర్ 30న సాయంత్రం 4:30 గంటలకు నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలుస్తోంది. ఇక చిరంజీవి సినిమాల విషయానికొస్తే.. మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తున్న ‘విశ్వంభర’లో చిరంజీవి కనిపించనున్నారు. అలాగే బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘కాకా’ సినిమాలోనూ నటిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 13న సంక్రాంతికి థియేటర్లలో విడుదల కాబోతోంది.



అది ఒక అద్భుతమైన సినిమా

కళ్యాణి ప్రియదర్శన్

మలయాళ యంగ్ బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్ గతేడాది ‘లోకా చాప్టర్-1 చంద్ర’ సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్నారు. మొట్టమొదటిసారిగా ఒక సూపర్ హీరో పాత్రలో కనిపించిన ఈ భామ, తన అద్భుతమైన నటనతో విశ్వరూపం చూపించి అభిమానులతో పాటు సినీ ప్రముఖుల ప్రశంసలు పొందారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ సరసన ‘ప్రళయ్’ అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కళ్యాణి ప్రియదర్శన్ తనకు ఎంతో ఇష్టమైన సినిమా గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తనకు ఎప్పటికీ అత్యంత ఇష్టమైన చిత్రం ‘మైఖేల్ మదన కామ రాజన్’ అని కళ్యాణి ప్రియదర్శన్ వెల్లడించారు. అది ఒక అద్భుతమైన సినిమా అని, అందులో దిగ్గజ నటుడు కమల్ హాసన్ నాలుగు విభిన్న పాత్రల్లో అద్భుతంగా నటించారని ప్రశంసించారు. ఆ సినిమాలోని ప్రతి పాత్ర ఎంతో ప్రత్యేకంగా ఉంటూ, ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుందని చెప్పారు. నేటి కాలంలో కూడా అలాంటి స్వచ్ఛమైన హాస్యభరితమైన సినిమాలు మరిన్ని రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు కళ్యాణి తెలిపారు.



ఆపాత్ర చేయడం నా అదృష్టం : రష్మిక మందన్న

భారతదేశపు దిగ్గజ కర్ణాటక గాయని ఎంఎస్ సుబ్బలక్ష్మి జీవిత కథ ఆధారంగా ‘ఎంఎస్ – ఏ లెగసీ ఆన్ స్క్రీన్’ అనే బయోపిక్ తెరకెక్కుతోంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో, అనిరుధ్ రవిచందర్ సంగీత సారథ్యంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటివరకు ఎన్నో విభిన్న పాత్రలతో మెప్పించిన రష్మిక, ఈ సినిమా కోసం తన కంఫర్ట్ జోన్ దాటి కర్ణాటక సంగీతం నేర్చుకోవడానికి సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రష్మిక ఈ ప్రాజెక్ట్ విశేషాలను పంచుకున్నారు. ఈ సినిమా తనకు ఎంతో ప్రత్యేకమని, దీని గురించి ఎంతవరకు మాట్లాడాలో తెలియక కొంచెం ఆందోళనగా ఉందని చెప్పారు. ఈ చిత్రాన్ని ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలనుకుంటున్నామని, పాత్ర కోసం కచ్చితంగా కర్ణాటక సంగీతం నేర్చుకోవడం మొదలుపెట్టాలని తెలిపారు. కేవలం పాడినట్లు నటించడం తన వల్ల కాదని, జీవితంలో ఇప్పటివరకు తాను ఎప్పుడూ పాట పాడలేదని, ఇంట్లో కనీసం హమ్ కూడా చేయనని రష్మిక చెప్పారు. ఇప్పుడు ఎంఎస్ అమ్మ పాత్ర చేసే అవకాశం రావడంతో సంగీతం నేర్చుకుని పాడాలనుకుంటున్నట్లు వెల్లడించారు. మొదట ఈ ఆఫర్ వచ్చినప్పుడు, అంతటి గొప్ప వ్యక్తి పాత్రను తాను చేయగలనా అని కొంచెం సంకోచించానని రష్మిక అన్నారు. ఆమె జీవితం ఎంతో అందమైనదని, రాబోయే తరాలకు ఆమె గురించి తెలియడం చాలా అవసరమని భావించి ఈ ఛాలెంజ్ తీసుకున్నట్లు చెప్పారు. సంగీతం అనే కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టడం ఆసక్తిగా ఉందని, తన శక్తి మేరకు వంద శాతం కష్టపడతానని తెలిపారు. కాగా, సెప్టెంబర్ 16న ఎంఎస్ సుబ్బలక్ష్మి 110వ జయంతి సందర్భంగా ప్రారంభమైన ఈ సినిమాలో నటించడం తన అదృష్టమని, మనసు నిండా కృతజ్ఞతతో ఉన్నానని రష్మిక పేర్కొన్నారు.

సవాల్‌తో కూడిన పాత్రలనే ఎంచుకుంటా : కృతి సనన్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ సినిమాలు చేయడం కంటే ఎక్కువ పలు కాంట్రవర్సీ కామెంట్స్ చేస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. అలాగే వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విభిన్నమైన కథలను ఎంచుకుంటున్నారు. తన నటనతో మెప్పిస్తూ వరుస అవకాశాలు దక్కించుకుంటూ దూసుకుపోతున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి సనన్ తాను సినిమాలు, పాత్రలను ఎలా ఎంచుకుంటారో తెలుపుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కథ విన్నప్పుడు భయపెట్టే, సవాల్ విసిరే పాత్రల కోసం తాను ఎప్పుడూ ఎదురుచూస్తానని కృతి చెప్పారు. ముఖ్యంగా ఎమోషనల్, ఇంటెన్స్ సినిమాల్లో కనీసం ఒక్క సీన్ అయినా తన కంఫర్ట్ జోన్ దాటి, ‘దీన్ని నేను ఎలా చేయగలను?’ అనిపించేంత కష్టంగా ఉండాలని కోరుకుంటానని, అదే తనను నటిగా ముందుకు నడిపిస్తుందని అన్నారు. అలాంటి సన్నివేశాలే నటిగా తన పరిధులను పెంచుకోవడానికి ప్రేరణనిస్తాయని ఆమె చెప్పారు. తాను నటించిన ‘దో పత్తీ’ సినిమాలో అలాంటి కష్టమైన సీన్ ఒకటి వచ్చిందని కృతి గుర్తుచేసుకున్నారు. అందులో తాను సౌమ్య, శైలీ అనే రెండు పాత్రలు చేశానని తెలిపారు. సౌమ్య బాగా కుంగిపోయి, తన తల్లిలా ప్రవర్తిస్తూ మాట్లాడే ఒక సీన్‌లో, పక్కనే శైలీ కూడా ఉంటుందని వివరించారు. ఆ సీన్‌లో వేరే నటులు ఎవరూ లేరని, ఇద్దరు వ్యక్తుల పాత్రలను తానే చేయాల్సి వచ్చిందని అన్నారు. అందుకే చేతిని ఎక్కడ పెట్టాలి, ఎప్పుడు పైకి లేపాలి అనే ప్రతి కదలికను ముందుగానే ప్లాన్ చేసుకుని రిహార్సల్స్ చేయాల్సి వచ్చిందని చెప్పారు.

గూగుల్‌లో భారీ లేఆఫ్‌లు..



భారత్‌లో టెక్ దిగ్గజం గూగుల్‌లో భారీగా ఉద్యోగుల తొలగింపులు జరుగుతున్నా యంటూ ఇటీవల వచ్చిన వార్తలపై సంస్థ స్పందించింది. లేఆఫ్‌ల ప్రచారాన్ని ఖండించింది. గత వారం గూగుల్ క్లౌడ్ ఇండియా విభాగంలో సంస్థాగత మార్పులు చేపట్టినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా సుమారు 30 రోల్స్ తొలగిం చినట్లు స్పష్టం చేసింది. అయితే ప్రభావితమైన ఉద్యోగులు ఏ టీమ్‌కు చెందినవారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. లేఆఫ్‌ల పై ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు గూగుల్ క్లౌడ్ ఇండియా అధికారిక ఖాతా స్పందించింది. "ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదు. పని ప్రాధాన్యతలను పునర్వ్యవస్థీకరించడంలో భాగంగా భారత్‌లో గూగుల్ క్లౌడ్ చిన్నపాటి సంస్థాగత మార్పులు చేపట్టింది" అని తెలిపింది. అయితే గూగుల్‌లో భారీగా ఉద్యోగాల కోతలు జరిగాయని ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఉద్యోగులు 24 గంటల్లో రాజీనామా చేయాలని, లేదంటే తొలగిస్తామని హెచ్చరిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. జనవరిలో మరిన్ని తొలగింపులు ఉండొచ్చని కూడా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో గూగుల్ వివరణ ఇచ్చింది.



బిజినెస్



గ్రే మార్కెట్ ప్రీమియాలు
పబ్లిష్ చేయొద్దు : సెబీ

ఐపీఓల ప్రకటనల తర్వాత వాటి అంచనాలను పెంచే గ్రే మార్కెట్ ప్రీమియం ధరలపై సెబీ స్పందించింది. జీఎంపీ ధరలను ప్రచురించడం, ప్రచారం చేయడం ఆపేయాలని మధ్యవర్తులను, మార్కెట్ వర్గాలను హెచ్చరించింది. అనధికారిక వెబ్‌సైట్లలో ప్రచురితమయ్యే ప్రీమియం ధరలు పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొంది. ఈ మేరకు సెబీ ఒక అడ్వైజరీ జారీ చేసింది. ఐపీఓల ప్రకటన వెలువడిన నుంచి కంపెనీల షేర్లు లిస్టింగ్ అయ్యేవరకు కొన్ని బ్రోకరేజీ సంస్థలు జీఎంపీని ప్రచురిస్తుంటాయి. వీటికి ఎలాంటి అధికారిక ధృవీకరణా ఉండదు. అదేవిధంగా ఈ జీఎంపీ లావాదేవీల్లో పాల్గొనే ఇన్వెస్టర్లకు సెబీ నుంచి ఎలాంటి రక్షణ ఉండదు. కాబట్టి ఏదైనా మోసం జరిగినా ఫిర్యాదు చేసే అవకాశం లభించదు. 'బ్రోకరేజీ కంపెనీలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసే జీఎంపీ ధరలను కొన్ని వెబ్‌సైట్లు, వార్తాపత్రికలు ప్రచురించడంతో ఇన్వెస్టర్ల అంచనాలు పెరుగుతున్నాయి. కొన్నిసార్లు వారు అంచనా వేసినదానికంటే తక్కువ ధరకే షేర్లు లిస్టింగ్ కావడంతో పెట్టుబడిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇది మార్కెట్ పారదర్శకతకు విరుద్ధం. ఇకపై జీఎంపీ పబ్లికేషన్లను ఆపేయాలి' అని మార్కెట్ బ్రోకర్లకు సెబీ స్పష్టం చేసింది. అదేవిధంగా, పెట్టుబడి పెట్టేటప్పుడు జీఎంపీ ధరలను ప్రామాణికంగా తీసుకోవద్దని ఇన్వెస్టర్లకు సూచించింది. జీఎంపీ లావాదేవీలు పూర్తిగా నియంత్రణ పరిధిలోకి రానందున, వాటికి దూరంగా ఉండాలని కోరింది.



24 ఏళ్లు సంస్థ కోసం పనిచేస్తే..
అవమానకరంగా లేఆఫ్ : మైక్రోసాఫ్ట్ ఉద్యోగి

టెక్ పరిశ్రమల్లో లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. కొన్ని సంస్థలు ముందుగా సమాచారం ఇస్తుంటే.. ఇంకొన్ని అకస్మాత్తుగా సిబ్బందిని తొలగించి షాక్‌కు గురిచేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితే టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ఉన్నతాధికారిణికి ఎదురైంది. ఎప్పటిలాగే విధుల్లో నిమగ్నమై ఉండగా.. లేఆఫ్ మెయిల్ రావడం తనను తీవ్రంగా బాధించిందని పేర్కొంటూ..ఆమె చేసిన సోషల్ మీడియా పోస్ట్ వైరల్‌గా మారింది. అమెరికాకు చెందిన గాలారా విలియమ్స్ సియాటెల్‌లోని మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో 24 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తూ.. ప్రిన్సిపల్ నాలెడ్జ్ ఇంజినీరింగ్ మేనేజర్ హోదాకు ఎదిగారు. ఇన్నేళ్ల తర్వాత సంస్థ ఒక్కసారిగా తనను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు మెయిల్ రావడంతో నమ్మకలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. 'కొన్ని రోజుల క్రితం ఇంజినీరింగ్ బృందాలు తమ సొంత డాక్యుమెంటేషన్‌ను రూపొందించడానికి సాధనాలను ఎలా ఉపయోగించవచ్చనే దానిపై జూనియర్లకు 90నిమిషాల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించాను. మీటింగ్ మధ్యలో ఉండగా మెయిల్ వచ్చింది. అందులో నన్ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు కంపెనీ ప్రకటన చూసి షాక్ అయ్యాను. కంపెనీతో 24 ఏళ్ల నా వృత్తి ప్రయాణానికి ఇది ఒక అవమానకరమైన ముగింపు. ఇలా జరుగుతుందని ఊహించలేదు. ఇన్నేళ్లుగా నాకు మద్దతిచ్చిన సహోద్యోగులు, మేనేజర్లకు కృతజ్ఞతలు' అని గాలారా విలియమ్స్ ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవ్ విధ్వంసం

53 బంతుల్లో 204 పరుగులు

ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో అసాధారణ ప్రదర్శన

యూఏఈపై 7 వికెట్లతో భారత్ విజయం

బౌలర్ చేతినుంచి బంతి దాటడమే తరువాయి...అర క్షణంలో దానిని సిక్సర్‌గా మలచడమే వైభవ్ పనిగా పెట్టుకున్నాడు. స్క్వేర్ లెగ్, డీప్ మిడ్‌వికెట్, కౌ కార్నర్, లాంగాన్, లాంగాఫ్, స్ట్రెయిట్ డౌన్ ద గ్రౌండ్, కవర్స్, ఎక్స్‌ట్రా కవర్, డీప్ కవర్, థర్డ్‌మాన్... ఇలా ఏ దిశను వదలిపెట్టలేదు. ఈ క్రమంలో ఒక జట్టంతా కలిసి కూడా కొట్టలేని 28 సిక్సర్లను వైభవ్ ఒంటి చేత్తో బాది పడేశాడు. అంటే 168 పరుగులు సిక్సర్లతోనే వచ్చాయి. 15 ఏళ్ల కుర్రాడి నుంచి వచ్చిన ఆ బ్యాట్ పవర్, స్పీడ్ నమ్మశక్యం కాని రీతిలో ఒక మాయా ప్రపంచాన్ని చూపించాయి.



దోహా: ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ వన్డే టోర్నీలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో మ్యాచ్‌లో భారత్ 'ఎ' విజయలక్ష్యం 250 పరుగులు... అయితే వైభవ్ బీభత్స బ్యాటింగ్ ప్రదర్శనతో ఈ లక్ష్యాన్ని భారత్ కేవలం 14.2 ఓవర్లలోనే ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (53 బంతుల్లో 204; 7 ఫోర్లు, 28 సిక్సర్లు) చెలరేగడంతో 3 వికెట్ల నష్టానికి భారత్ 254 పరుగులు సాధించి టోర్నీలో సెమీఫైనల్ స్థానాన్ని ఖాయం చేసుకుంది. అంతకు ముందు టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. హర్‌ప్రీత్ సింగ్ (144 బంతుల్లో 130; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, బాసిల్ హమీద్ (36 నాటౌట్) రాణించాడు. భారత బౌలర్లలో అర్నద్ ఖాన్‌కు 4 వికెట్లు దక్కాయి. గురువారం జరిగే తొలి సెమీఫైనల్లో శ్రీలంక 'ఎ'తో భారత్ 'ఎ' తలపడుతుంది.

ఇన్నింగ్స్ సాగిందిలా...

తొలి రెండు బంతులకు పరుగు తీయకుండా వైభవ్ ఆట మొదలైంది! కానీ ఆపై తుఫాన్ ఎదురు లేకుండా సాగిపోయింది. తర్వాతి మూడు బంతుల్లో వరుసగా 3 సిక్స్‌లు, రెండో ఓవర్లో ఫోర్, 2 సిక్స్‌లు, మూడో ఓవర్లో మరో మూడు సిక్స్‌లు...16 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తయింది. నాలుగో ఓవర్లో ఒకే ఫోర్ రావడంతో కాస్త ప్రశాంతత కనిపించగా, తర్వాతి ఓవర్లో మళ్లీ 3 సిక్స్‌లు సీన్ షురూ...ఇబ్రార్ అహ్మద్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్ హైలైట్‌గా నిలిచింది. అంతకు ముందు అభిషేక్‌ను ఎల్బీగా అవుట్ చేసిన తర్వాత భారత బ్యాటర్ దగ్గరకు వచ్చి సెండాఫ్ ఇస్తూ ఇబ్రార్ పరుష పదాలు వాడాడు. నీ ప్రతీకారం కూడా నేనే తీర్చుకుంటా అన్నట్లుగా వైభవ్ వరుసగా 6, 4, 4, 6, 6, 4తో 30 పరుగులు రాబట్టాడు. ఇందులో మూడో బంతికే 28 బంతుల్లో సెంచరీ కూడా పూర్తయింది. 10 ఓవర్ల పవర్‌ప్లే ముగిసే సరికే వైభవ్ 21 సిక్సర్లు బాదేశాడు. పైగా 40 బంతుల్లో 150 పరుగుల మార్క్‌ను కూడా దాటాడు. అతను 160 వద్ద ఇచ్చిన సులువైన క్యాచ్‌ను ఫీల్డర్ వదిలేయడం ఆపై కలిసొచ్చింది. సూరి వేసిన 12వ ఓవర్లో కూడా వరుసగా 6, 6, 6, 6, 4 కొట్టడంతో 28 పరుగులు లభించాయి. 13వ ఓవర్ నాలుగో బంతిని డీప్ మిడ్ వికెట్ మీదుగా సిక్స్‌గా మలచడంతో 52 బంతుల్లో డబుల్ సెంచరీ మార్క్‌ను అందుకొని కుర్రాడు చిరునవ్వులు చిందించాడు. ఏకంగా



51 బంతుల తేడాతో పాత డబుల్ సెంచరీ రికార్డును వైభవ్ పడగొట్టడం విశేషం! ఈ మైలురాయిని అందుకున్న తర్వాత ఆడిన రెండు బంతులు వైడ్ కాగా, తర్వాతి బంతికి క్యాచ్ ఇవ్వడంతో ఈ సునామీకి విరామం లభించింది.



శుభ్‌మన్.. అలా చేయడం
కరెక్టు కాదు : రహానె

న్యూజిలాండ్‌తో తొలి టెస్టు సందర్భంగా భారత్ పేసర్ అకాశ్‌దీప్‌పై... కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వ్యవహరించిన తీరును మాజీ క్రికెటర్ అజింక్య రహానె తప్పుబట్టాడు.. క్లిష్ట పరిస్థితుల్లో జట్టు సభ్యులకు మద్దతుగా ఉండాలే తప్ప.. విమర్శలకు తావివ్వకూడదని హితవు పలికాడు. అసలేం జరిగిందంటే.. న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో వాషింగ్టన్ సుందర్ వేసిన 71వ ఓవర్ తొలి బంతిని డారిల్ మిచెల్ మిడాన్ మీదుగా బాదాడు. సగం పిచ్ దాటేసిన అతడిని.. అవతలి ఎండ్‌లో ఉన్న బ్లుండెల్ వెనక్కి పంపాడు. మిడాన్‌లో ఫీల్డింగ్ చేస్తున్న ఆకాశ్.. బంతిని సరైన సమయంలో అందుకొని స్ట్రైకింగ్ ఎండ్ వైపు విసరలేకపోవడంతో రనౌట్ మిస్సయింది. దీంతో ఆకాశ్‌పై గిల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. అతర్వాత మిచెల్ ఏకంగా 49 పరుగులు బాదేశాడు. దీనిపై ఓ టీవీ ఛానల్‌లో రహానె మాట్లాడుతూ.. ఆకాశ్‌కు మద్దతుగా నిలిచాడు. ఆటలో ఇవన్నీ సహజమని.. అంతమాత్రన చిరాకు పడకూడదని గిల్‌కు హితవు పలికాడు. "బంతివైపు చూడకుండా.. తర్వాతి ఓవర్‌ను ఎలా వేయాలనే దానిపై ఆకాశ్ దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. అందుకే సరిగా స్పందించలేకపోయాడు. ఇలాంటి సందర్భంలో సహచర ఆటగాళ్ల మద్దతు చాలా అవసరం" అని అన్నాడు.

పిచ్‌లో ఏమాత్రం జీవం లేదు



న్యూజిలాండ్ ఇంకా 233 పరుగులు వెనుకబడి ఉండగా, మిగిలిన 8 వికెట్లు పడగొట్టి తొలి టెస్టును టీమ్‌ఇండియా చేజిక్కించుకుంటుందనే నమ్మారు అభిమానులు. కానీ రోజంతా కలిపి 3 వికెట్లే పడగొట్టి, విజయాన్ని దూరం చేసుకుంది భారత్. మధ్యాహ్నం వరకు పర్వాలేదనిపించినా.. ఆ తర్వాత బౌలర్లు తేలిపోయారు. అయితే దీన్ని పూర్తిగా బౌలర్ల వైఫల్యంగా చూడలేమన్నది విశ్లేషకుల మాట. పిచ్‌లో ఏమాత్రం జీవం లేకపోవడానికి తోడు.. బంతి కూడా సమస్యగా మారి వికెట్లు తీయడం బాగా కష్టమైపోయిందనే చర్చ జరుగుతోంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా ఏకంగా 720 పరుగులతో న్యూజిలాండ్‌లో అత్యధిక స్కోరు నెలకొల్పిన సంగతి తెలిసిందే. అప్పుడే పిచ్ ఎంత తేలిగ్గా ఉందన్నది అర్థమైపోయింది. ఇక బంతి విషయానికి వస్తే.. 30 ఓవర్లకు నునుపుదేలడంతో సీమ్, స్వింగ్‌కు అవకాశం లేకుండా పోయిందని ఇరు జట్ల ఆటగాళ్లూ అసహనం వ్యక్తం చేశారు. బంతికి లాలాజలం రాయడాన్ని నిషేధించడంతో జీవం లేని పిచ్‌లపై బౌలర్లకు మరింత కష్టమవుతోందన్న వాదనా వినిపిస్తోంది. ఇదే విషయమై భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. "కూకాబుర్రా బంతులు 25-30 ఓవర్లకే మృదువుగా తయారవుతున్నాయి. కొవిడ్ రోజులు ఎప్పుడో పోయాయి. ఏడెనిమిదేళ్లు గడిచాక కూడా ఇంకా బంతిపై ఉమ్ము రాయడంపై నిషేధాన్ని కొనసాగించడం సరికాదు. పిచ్‌లో ఏమాత్రం వేగం లేదు. బంతి విషయంలో అవతలి జట్టు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఉమ్మును ఉపయోగించడాన్ని అనుమతించాలి" అని చెప్పాడు. మరోవైపు చివరి రోజు శుభ్‌మన్ కెప్టెన్సీ, ఫీల్డింగ్ ఏర్పాట్ల విషయంలోనూ కొంత విమర్శలు తప్పలేదు. వికెట్ కోసం దూకుడైన ఫీల్డింగ్ ఏర్పాటు చేయకుండా.. షార్ట్ లెగ్, రెండో స్లిప్ లాంటివి తీసేయడాన్ని, ఎక్కువగా లెగ్ సైడ్ ఆడే మిచెల్ శైలికి అనుగుణంగా ఫీల్డింగ్ ఏర్పాట్లు లేకపోవడాన్ని విశ్లేషకులు తప్పుబట్టారు. ఇంకో గంట ఆట ఉండగా.. చివరి వరకు ప్రయత్నించకుండా, ముందే డ్రాకు అంగీకరించడం మీదా ప్రశ్నలు తలెత్తాయి.

గోల్డ్ స్పాట్ మళ్లీ వస్తోంది



దేశీయ శీతల పానీయాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన వాటిల్లో 'గోల్డ్ స్పాట్' ఒకటి. దాదాపు 26 సంవత్సరాల క్రితం నిలిచిపోయిన ఈ కూల్ డ్రింక్, వచ్చే వారం నుంచే మళ్లీ మన మార్కెట్‌లోకి అడుగుపెట్టనుందని సమాచా రం. మార్కెట్‌లో హెల్తీ, షుగర్-ఫ్రీ డ్రింక్స్‌కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో, 'లో-షుగర్ లేదా జీరో-షుగర్' విభాగంలో గోల్డ్ స్పాట్‌ను రీలాంచ్ చేయాలని కోకకోలా ఇండియా నిర్ణయించడం ఇందుకు నేపథ్యం. 'ది జింగ్ థింగ్' ట్యాగ్‌లైన్‌తో 1980 తరం వినియోగదారులను ఆకట్టుకున్న గోల్డ్ స్పాట్.. ఇప్పుడు క్యాన్‌ల రూపంలో వస్తోంది. గోల్డ్‌స్పాట్ క్యాన్‌లను పట్టుకున్న ప్రసిద్ధ క్రికెటర్ ఎంఎస్ ధోనీ, ఆయన భార్య సాక్షి ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్నాయి. 1993లో చేతులు మారి.. 2000లో నిలిపివేత: 1993లో పార్లే బిస్లరీ అధిపతి రమేష్ చౌహాన్ నుంచి థమ్స్ అప్, లిమ్కా, మజా, గోల్డ్ స్పాట్ బ్రాండ్లను కోకకోలా కొనుగోలు చేసింది. తమ గ్లోబల్ ఆరెంజ్ బ్రాండ్ 'ఫాంటా'ను విస్తరించే క్రమంలో 2000 సంవత్సరంలో గోల్డ్ స్పాట్ విక్రయాలను కోకకోలా పూర్తిగా నిలిపివేసింది. ఇప్పుడు కూడా ఫాంటా విక్రయాలకు నష్టం కలగకుండా ఉండేందుకు, గోల్డ్‌స్పాట్‌ను ప్రత్యేకంగా 'హెల్త్-కాన్షియస్' కేటగిరీలో లో-షుగర్/ నో-షుగర్ డ్రింక్‌గా పున:ప్రవేశపెడుతున్నారని చెబుతున్నారు.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com